## విలేఖరులు కావలెను

పత్రికా రంగం లో సరికొత్త సంచలనం..
మా జన సముద్రం..
ప్రతి అక్షరం జనం కోసం మా నినాదం..
అనుక్షణం ప్రజా ప్రయోజనమే మరియు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగనున్న మా పత్రిక లో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ జిల్లాలు,మండలాల వారీగా విలేఖరులు కావలెను..సామాజిక స్పృహ,వార్తల సేకరణ పట్ల మక్కువ.. నిజాయితీ ఇవే మా విలేఖరులకు ఉండవలసిన ముఖ్య అర్హతలు..!
సంప్రదించండి.. 9494184136



RNI NO:APTEL16151

నిరంతర వారా ప్రవాహం

# జనసముద్రం న్యూస్

ప్రతి అక్షరం జనం కోసం






JANASAMUDRAM.COM

సంపుటి:04 | సంచిక:300 | సోమవారం జూన్ 01, 2026 | ఎడిటర్: వేణు గోపాల్ రెడ్డి | పేజీలు:08 | వెల.రూ. 2.00


# అవి భారతీయులకు గర్వకారణం..

## అనైమంగళం రాగి శాసనాలపై ప్రధాని మోదీ



- గుర్విందర్, అనిమేష్‌కు మోదీ అభినందనలు.
- 100 మీటర్ల పరుగులో కొత్త రికార్డులు.
- అనైమంగళం శాసనాలు భారత్‌కు తిరిగి వచ్చాయి.
- డాల్ఫిన్ రక్షకులను ప్రశంసించిన ప్రధాని.
- డాల్ఫిన్ అంబులెన్స్ సేవలపై ప్రశంసలు.
- ఎండలపై జాగ్రత్తలు పాటించాలని సూచన.
- మజ్జిగ, షర్బత్ వంటి పానీయాలు తీసుకోవాలని సూచించారు.

భారత అథ్లెట్ గుర్విందర్ సింగ్‌పై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. రాంచీలో జరిగిన జాతీయ సీనియర్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ పోటీల గురించి ఆదివారం మన్‌కీ బాత్ 134వ కార్యక్రమంలో ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. వందమీటర్ల పరుగులో రికార్డులు సృష్టించిన అథ్లెట్లు గుర్విందర్, అనిమేష్‌తో ఆయన నేరుగా మాట్లాడారు.
కేవలం రెండు రోజుల్లోనే 100 మీటర్ల పరుగు పందెంలో జాతీయస్థాయిలో మూడు రికార్డులు సృష్టించామని మోదీ అన్నారు. ఈ అద్భుతమైన ఘనత సాధించిన ఇద్దరు అథ్లెట్లు గుర్విందర్ సింగ్, అనిమేష్‌కు అభినందనలు తెలిపారు. మోదీ పర్యటన నేపథ్యంలో 'అనైమంగళం' రాగి శాసనాలను నెదర్లాండ్స్ ప్రభుత్వం భారత్‌కు తిరిగి అప్పగించిన సంగతి తెలిసిందే. ఇది భారతీయులు గర్వించదగిన విషయమని మోదీ అన్నారు. ఇక, ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఓ కాలువల చిక్కుకుపోయిన డాల్ఫిన్‌ను కొందరు దాదాపు 13 గంటలపాటు శ్రమించి రక్షించారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది.



## టీఎంసీ అంతర్గత కుమ్ములాటలే అభిషేక్ బెనర్జీపై దాడికి కారణం: భాజపా

- అభిషేక్ బెనర్జీపై దాడి వెనుక టీఎంసీ అంతర్గత కుమ్ములాటలే కారణమని భాజపా ఆరోపణ.
- అరెస్టైన నిందితులు మాజీ ఎమ్మెల్యే లప్లీ మొయిత్రా అనుచరులేనని భాజపా వ్యాఖ్య.
- టీఎంసీపైనే ప్రజాగ్రహం వ్యక్తమవుతోందని అగ్నిమిత్ర పాల్ అన్నారు.
- టీఎంసీ హింసాత్మక రాజకీయాలకు పాల్పడిందని భాజపా విమర్శ.
- రాష్ట్ర అభివృద్ధికి కలిసి పనిచేయాలని పిలుపు.

2లో

## ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ఖరీఫ్‌కు సాగునీరు విడుదల



రాజమహేంద్రవరం: ఇరిగేషన్‌పై కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతోందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ఖరీఫ్‌కు ఆయన సాగునీరు విడుదల చేశారు. మంత్రి దుర్గేష్‌తో పాటు కూటమి ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకు ముందు ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ప్రత్యేకపూజలు నిర్వహించారు. గోదావరికి జలహారతి ఇచ్చి.. మీట నొక్కి నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టా కాలువకు నీటి విడుదలతో తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# ఎన్నిసార్లు దొరికిపోయినా..

## కుట్ర రాజకీయాలు మానరా?: నారా లోకేశ్

అమరావతి: నంద్యాలలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసమైన ఘటనపై వైకాపా శ్రేణులు ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. దీనిపై ఏపీ మంత్రి, తెదేపా కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేశ్ స్పందించారు. నంద్యాలలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం చేసిన జమ్ములయ్య.. వైకాపా నేతల అనుచరుడేనని పోలీసులు తేల్చినట్లు చెప్పారు. బాబాయి గుండెపోటు, కోడి కత్తి, గులకరాయి నాటకాల రాయుడైన జగన్.. మరో కొత్త డ్రామా సృష్టించాడని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు తన గొడ్డలి పార్టీ కార్యకర్తలను సైకో జగన్ రంగంలోకి దింపారని మండిపడ్డారు. జగన్నాటకాలు చూసి జనం ఛీకొట్టినా.. డ్రామాలు మానట్లేదని అన్నారు. ఎన్ని సార్లు దొరికిపోయినా.. కుట్ర, క్షుద్ర రాజకీయాలు మానరా? అని ప్రశ్నించారు.



# ఆన్‌మార్క్ పోర్టల్..

## లోపాలు పరిశీలిస్తున్నాం : సీబీఎస్ఈ



ఆన్-స్క్రీన్ మార్కింగ్ మూల్యాంకన ప్రక్రియపై వివాదం నేపథ్యంలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఎట్టకేలకు మౌనం వీడింది. ఈ పోర్టల్‌లో వెలుగు చూస్తున్న లోపాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నామని పేర్కొంది. ఈ వ్యవస్థను పటిష్ఠం చేయడానికి సైబర్ సెక్యూరిటీ నిపుణుల బృందం కొన్ని రోజులుగా పనిచేస్తోందని, ఇప్పటివరకు గుర్తించిన సమస్యలను సరిచేసిందని తెలిపింది. పేజి 2లో ▶

# రైతు డిస్కం..

## 7 గంటలే విద్యుత్ ఇచ్చేలా కుట్ర: హరీశ్‌రావు



2లో

# ట్రాక్టర్ నడిపి..

## పొలం దున్నిన మంత్రి నిమ్మల రామానాయుడు



పాలకొల్లు మార్కెట్, పాలకొల్లు గ్రామీణం: ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు స్వగ్రామంలో వ్యవసాయ పనుల్లో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం పాలకొల్లు నుంచి ఏడు కిలోమీటర్లు సైకిల్ తొక్కుకుంటూ అగర్తిపాలెనికి చేరుకున్నారు. దారి పొడవునా ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సొంత రొయ్యల చెరువులో మేత వేసి.. రొయ్యల ఎదుగుదలను పరిశీలించారు. అనంతరం తన పొలంలో ట్రాక్టర్‌తో దుక్కిదున్నారు. పేజి 2లో ▶

- మంత్రి నిమ్మల రామానాయుడు స్వగ్రామంలో వ్యవసాయ పనులు చేశారు.
- 7 కి.మీ. సైకిల్ తొక్కి అగర్తిపాలెం చేరుకున్నారు.
- రొయ్యల చెరువును పరిశీలించి మేత వేశారు.
- ట్రాక్టర్ నడిపి పొలం దుక్కిదున్నారు.
- రైతులు వరి నాట్లకు సిద్ధం కావాలని సూచించారు.
- జల సంరక్షణపై ప్రత్యేకంగా పిలుపునిచ్చారు.

## రైతు డిస్కం పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి కొత్త నాటకం: కేటీఆర్



హైదరాబాద్: రైతు డిస్కం పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి కొత్త నాటకం ఆడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. "రేవంత్‌రెడ్డి గతంలో సాగుకు రోజుకు 3 గంటల విద్యుత్ చాలన్నారు. ఇప్పుడు మాటమార్చి రైతు డిస్కం ఏర్పాటు చేస్తామంటున్నారు. రైతు మెడకు ఉరి పెట్టే డిస్కం అది. కంటోన్మెంట్ ఉప ఎన్నిక సమయంలో స్థానికంగా ఆరు వేల ఇళ్లు కట్టిస్తామన్నారు. ఇప్పటి వరకు ఆరు ఇళ్లయినా కట్టించారా? రేవంత్‌రెడ్డి 420 హామీలు అమలు చేసి చూపించాలి. కేసీఆర్ అప్పులు చేసి సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేశారు. రూ.4 లక్షల కోట్ల అప్పులు చేసిన రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి ఏం చేశారో చెప్పాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## రైతు డిస్కం ఏర్పాటు వెనుక కుట్ర ఉంది: కవిత



2లో

# 'జెన్ జీ'.. చూస్తోంది జాగ్రత్త!

..మా పార్టీకి సుదీర్ఘ చరిత్ర ఉందన్న నినాదానికి కాలం చెల్లింది. యువతరంతో కనెక్ట్ కాని పార్టీలు మెల్లగా తెరమరుగవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే తాజాగా జరిగిన తెలుగుదేశం పార్టీ మహానాడులో జెన్ జీ, జెన్ ఆల్ఫా పదాలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రముఖంగా ప్రస్తావించారు.

..స్వాతంత్ర్యం వచ్చి దాదాపు ఎనభై సంవత్సరాలు అవుతున్నందున స్వాతంత్ర్య పోరాటంలో అప్పటి కాంగ్రెస్ నాయకుల పాత్ర, తెల్ల దొరల పాలనలో ఈ దేశ ప్రజలు అనుభవించిన కష్టాల గురించి నేటి తరానికి అవగాహన లేకుండా పోయింది. దేశానికి స్వాతంత్ర్యం ఆషామాషీగా రాలేదని, ఎంతో మంది ప్రాణత్యాగం చేశారనే విషయం కూడా నేటి తరం తెలుసుకోలేకపోతోంది.

..డెబ్భై అయిదేళ్లు పైబడిన ప్రధాని మోదీ ఈ దేశం యువతతో కనెక్ట్ అవుతుండగా... వయసులో చిన్నవాడైన రాహుల్ గాంధీ యువతను ఆకట్టుకోలేక పోతున్నారు. ఈ పరిస్థితికి కారణాలను అన్వేషించకుండా కాలం చెల్లిన విధానాలు, వివాదాలతోనే ఆ పార్టీ ముందుకు వెళుతోంది.

..మోదీ అధికారంలోకి వచ్చి పన్నెండేళ్లు అవుతోంది. ప్రజల్లో ఆయన పట్ల కూడా కొంత విముఖత ఏర్పడటం మొదలైంది. ప్రతిపక్షం బలంగా లేనప్పుడు ప్రజలే ప్రతిపక్షం బాధ్యత తీసుకుంటారు. బొద్దింకల ఉద్యమమే ఇందుకు నిదర్శనం. అభిజిత్ అనే ఒక దళిత యువకుడు సోషల్ మీడియా వేదికగా ప్రారంభించిన కాక్రోచ్ జనతా పార్టీకి ఫాలోవర్ల సంఖ్య భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ పార్టీలను మించిపోయింది.

..ఢిల్లీ నుంచి గల్లీ దాకా వివిధ స్థాయిల్లో ఇప్పుడు జవాబుదారీతనం లోపించింది. అధికార దుర్వినియోగం పెచ్చరిల్లింది. ప్రభుత్వాలలో ఏ స్థాయిలో కూడా జవాబుదారీతనం కనిపించడం లేదు. లంచం ఇవ్వనిదే కాగితం కదలని పరిస్థితి. ఈ కారణంగానే ఈ దేశ యువతలో ఆశలు, ఆకాంక్షలతో పాటు నిరాశా నిస్పృహలు చోటుచేసుకుంటున్నాయి.

..నేపాల్, బంగ్లాదేశ్‌లో ప్రజల్లో తిరుగుబాటుకు ప్రభుత్వాలలో జవాబుదారీతనం లోపించడమే ప్రధాన కారణంగా చెబుతున్నారు. దురదృష్టవశాత్తు మన దేశంలో కూడా రాజకీయ వ్యవస్థ మీదే కాదు – కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థ, మీడియా పట్ల కూడా ప్రజల్లో అసంతృప్తి ఉంది. ఈ నేపథ్యంలోనే బొద్దింకల పార్టీ పుట్టుకొచ్చింది.

..అభివృద్ధి మాత్రమే ఓట్లు తెచ్చి పెట్టదు. ప్రభుత్వం పట్ల ప్రజల్లో, ముఖ్యంగా యువతలో ఫీల్ గుడ్ భావన కల్పించాలి. అది రావాలంటే ఇటు ప్రభుత్వంలో, అటు పార్టీలో జవాబుదారీతనాన్ని నెలకొల్పాలి. రాష్ట్రంలో మూడో పార్టీకి చోటు లేదని భావించడానికి లేదు.

జెన్ జీ-- జెన్ ఆల్ఫా! ఇప్పుడు కొత్తగా బొద్దింకలు! ఈ పదాలు వినపడినప్పుడల్లా మన దేశంలోని ప్రధాన రాజకీయ పార్టీలు ఉలిక్కిపడుతున్నాయి. నిన్నటి తరం ఆలోచనలతో, పాత చింతకాయ పచ్చడి విధానాలతో నడుస్తున్న పార్టీలకు ఎన్నికలలో నవతరం నుంచి ప్రతిఘటన ఎదురవుతోంది. యువతరంలో ఆశలు--ఆకాంక్షలు పెరుగుతున్న సమయంలోనే నిరాశా నిస్పృహలు కూడా వారిని కమ్మేస్తున్నాయి. ఫలితంగానే జెన్ జీ--బొద్దింకలు వంటి నినాదాలు పుట్టుకొచ్చి సంప్రదాయ రాజకీయ పార్టీలను తుడిచిపెడుతున్నాయి. మా పార్టీకి సుదీర్ఘ చరిత్ర ఉందన్న నినాదానికి కాలం చెల్లింది. యువతరంతో కనెక్ట్ కాని పార్టీలు మెల్లగా తెరమరుగవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే తాజాగా జరిగిన తెలుగుదేశం పార్టీ మహానాడులో జెన్ జీ, జెన్ ఆల్ఫా పదాలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రముఖంగా ప్రస్తావించారు. నవతరంతో పార్టీ అనుబంధాన్ని పటిష్ఠం చేసే ప్రయత్నం చేశారు. తమిళనాడు ఎన్నికల ఫలితాల నేపథ్యంలో చంద్రబాబు యువత ప్రాధాన్యాన్ని గుర్తించినట్టుంది. ప్రధాని నరేంద్ర మోదీ కూడా సామాజిక మాధ్యమాలలో యువతరం వెలిబుచ్చుతున్న అభిప్రాయాలను ఎప్పటికప్పుడు తెలుసుకొని తదనుగుణంగా వ్యూహాలు రూపొందించుకోవాలని పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. నిన్నటి తరానికి చెందిన ఈ ఇరువురు నాయకులూ రేపటి తరం గురించి ఆలోచించడానికి కారణం లేకపోలేదు. ఈ క్రమంలో ముందుగా కాంగ్రెస్ పార్టీ గురించి తెలుసుకుందాం. స్వాతంత్ర్య సంగ్రామాన్ని ముందుండి నడిపించిన కాంగ్రెస్ పార్టీ... ఆ తర్వాత దేశాన్ని సుదీర్ఘ కాలం పరిపాలించింది. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నుంచి లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, పీవీ నరసింహారావు, మన్మోహన్‌సింగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రధానమంత్రులుగా పనిచేశారు. స్వాతంత్ర్యం వచ్చి దాదాపు ఎనభై సంవత్సరాలు అవుతున్నందున స్వాతంత్ర్య పోరాటంలో అప్పటి కాంగ్రెస్ నాయకుల పాత్ర, తెల్ల దొరల పాలనలో ఈ దేశ ప్రజలు అనుభవించిన కష్టాల గురించి నేటి తరానికి అవగాహన లేకుండా పోయింది. దేశానికి స్వాతంత్ర్యం ఆషామాషీగా రాలేదని, ఎంతో మంది ప్రాణత్యాగం చేశారనే విషయం కూడా నేటి తరం తెలుసుకోలేకపోతోంది. ఫలితంగా ప్రజల్లో జాతీయ భావం మసకబారింది.

ఈ కారణంగానే కాంగ్రెస్ పార్టీ కూడా నేటి తరానికి దూరమైంది. కాంగ్రెస్ నాయకుల పెడ ధోరణులు కూడా మరో ప్రధాన కారణం. నాయకులు అవినీతి రొచ్చులో మునిగితేలడం వల్ల ప్రజలకు కాంగ్రెస్ దూరమైంది. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ బలిదానాల గురించి ఈ తరానికి పెద్దగా తెలియదు. పార్టీని ఎప్పటికప్పుడు యువతతో కనెక్ట్ చేసుకునే పనిని కాంగ్రెస్ నాయకులు కూడా చేయలేదు. విధానాలను, ఆలోచనలను సవరించుకొని నవీకరించుకోలేదు. అధికారాన్ని బాధ్యతగా కాకుండా సంపాదనకు మార్గంగా భావించడం వల్ల కాంగ్రెస్ పార్టీ నాయకుల పట్ల ప్రజలకు ముఖం మొత్తింది. ఫలితంగా నవ తరానికి ఆ పార్టీ దూరమైంది. విచిత్రమేమిటంటే, డెబ్భై అయిదేళ్లు పైబడిన ప్రధాని నరేంద్ర మోదీ ఈ దేశం యువతతో కనెక్ట్ అవుతుండగా... వయసులో చిన్నవాడైన రాహుల్‌గాంధీ యువతను ఆకట్టుకోలేకపోతున్నారు. ఈ పరిస్థితికి కారణాలను అన్వేషించకుండా కాలం చెల్లిన విధానాలు, వివాదాలతోనే ఆ పార్టీ ముందుకు వెళుతోంది. ఈ కారణంగానే ఉత్తర భారతంలో ఆ పార్టీ తన అస్తిత్వాన్ని దాదాపుగా కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. ప్రజలకు మనం ఎందుకు దూరమయ్యామనే ఆత్మపరిశీలన చేసుకోకుండా... ఐదారు దశాబ్దాల క్రితం కమ్యూనిస్టుల నోటి వెంట వెలువడిన నినాదాలను, వారు అనుసరించిన విధానాలను కాంగ్రెస్ పార్టీ అందిపుచ్చుకుంది. తరం మారినప్పుడల్లా ప్రజల ఆకాంక్షలు, ఆలోచనలు మారుతుంటాయని గుర్తించలేకపోతోంది.

### చైనాను చూసైనా...

చైనాలో చోటుచేసుకున్న తియాన్మెన్ స్క్వేర్ ఉదంతాన్నే తీసుకుందాం. అక్కడి కమ్యూనిస్టు ప్రభుత్వం అమలు చేస్తున్న కఠిన ఆంక్షలకు వ్యతిరేకంగా యువత గొంతు వినిపించింది. నిరసనలు ఉద్యమ రూపం సంతరించుకున్నాయి. నాటి ఉద్యమాన్ని అక్కడి ప్రభుత్వం అణచివేసినప్పటికీ... ఆ తర్వాత తన విధానాలను సవరించుకుంది. అంతకు ముందు అమలు చేసిన కఠిన నిబంధనలను సడలించి అనేక వెసులుబాట్లను కల్పించింది. ఇప్పుడు చైనాలో పగటిపూట కమ్యూనిజం, రాత్రి పూట క్యాపిటలిజం అమల్లో ఉంటున్నాయి. సౌకర్యాలు, విలాసాల కోసం పాశ్చాత్య దేశాల వైపు చూసే అవసరం లేకుండా చేశారు. ఫలితంగానే ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిజం అంతరించిపోయినా చైనాలో మాత్రం వర్ధిల్లుతోంది. గ్లోబలైజేషన్ ప్రభావం ప్రపంచ దేశాలను చుట్టుముడుతున్న వేళ మన దేశంలో కాంగ్రెస్ పార్టీ సోషలిజం, సెక్యులరిజం వంటి విధానాలను సవరించుకోకుండా పాత విధానాలనే పట్టుకువేలాడింది. ప్రపంచీకరణ ప్రభావం మన దేశంలో గ్రామాలకు కూడా విస్తరించిన వాస్తవాన్ని విస్మరించింది. సెక్యులరిజం కూడా శ్రుతి మించుతోందని ప్రజలు భావిస్తున్న విషయాన్ని కాంగ్రెస్ నాయకులు గుర్తించలేదు. ఈ కారణంగానే ప్రధాని మోదీ తిరుగులేని నేతగా ఎదిగారు.

### 'కాక్రోచ్' కలకలం

మోదీ అధికారంలోకి వచ్చి పన్నెండేళ్లు అవుతోంది. ప్రజల్లో ఆయన పట్ల కూడా కొంత విముఖత ఏర్పడటం మొదలైంది. ప్రతిపక్షం బలంగా లేనప్పుడు ప్రజలే ప్రతిపక్షం బాధ్యత తీసుకుంటారు. బొద్దింకల ఉద్యమమే ఇందుకు నిదర్శనం. అభిజిత్ అనే ఒక దళిత యువకుడు సోషల్ మీడియా వేదికగా ప్రారంభించిన

## ఉగ్రవాదులకు సాయంగా భారత్‌లోకి అక్రమంగా టెలికామ్ సంకేతాలు : పాక్ దుశ్చర్య



ఉగ్రవాద పోషణలో పాక్ వంకర బుద్ధి మారడంలేదు. జమ్మూ కశ్మీర్‌లోని ఉగ్ర నెట్‌వర్క్‌ల కోసం అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ నిబంధనల ఉల్లంఘనలకు కూడా పాల్పడుతోంది. ఇందుకోసం సరిహద్దుల వెంట భారత్ వైపు అక్రమంగా సెల్యూలర్ సంకేతాలను పంపిస్తోంది. ఇది ఉగ్రవాదుల రహస్య కమ్యూనికేషన్లకూ ఊపిరిగా ఉపయోగపడుతోందని అధికారులు వెల్లడించారు.

ఇటీవల పాకిస్థాన్ చర్యలు అధికారుల అనుమానాలను మరింత బలపరుస్తున్నాయి. ముఖ్యంగా దక్షిణ పీర్ పంజాల్ పర్వతశ్రేణుల్లో చొరబాట్లు పెరుగుతున్నాయి. దీనికి తోడు నియంత్రణ రేఖకు అటువైపు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఏర్పాటు చేసిన సెల్ టవర్ల సంకేతాలు కరుడు గట్టిన ఉగ్రవాదులున్న జైళ్లకు చేరుతున్నాయి. కశ్మీర్‌లోని పర్వతశ్రేణులు సహజంగా చాలా వరకు సంకేతాలను అడ్డుకొంటున్నా.. మైదాన ప్రాంతం ఉన్న జమ్మూలో మాత్రం ఈ సంకేతాలు భారత్‌లోకి చొరబడి ఉగ్రనెట్‌వర్క్‌లకు చేరుతున్నాయి.

ముఖ్యంగా కతువా, రాజౌరీ, పూంచ్ జిల్లాలు, జమ్మూలోని కోట్ బల్వాల్ జైలు వంటి ప్రదేశాల వద్ద పాక్ టెలికామ్ సిగ్నల్స్‌ను మన దళాలు గుర్తించాయి. కొన్ని జైళ్లలో ఇప్పటికే జామర్లను ఏర్పాటు చేసినా వీటిని అడ్డుకోవడంలో విఫలం అవుతున్నాయి. అక్రమంగా కారాగారాల్లోకి చేరిన ఫోన్లను ఖైదీలు వినియోగిస్తున్నారు. జమ్మూకశ్మీర్‌లో మొత్తం 14 జైళ్లు, రెండు కరెక్షన్ హోమ్‌లు ఉన్నాయి.

పాకిస్థాన్ టవర్లు చైనాకు చెందిన సీడీఎంఏ టెక్నాలజీని వినియోగిస్తున్నాయి. వీటిల్లో అత్యున్నత స్థాయి ఎన్‌క్రిప్షన్ సాధ్యమవుతుంది. ఇది ఉగ్రవాదులు వాడే వైఎస్ఎంఎస్‌కు ఉపయోగపడుతుంది. సీడీఎంఏ పలు సిగ్నల్స్‌ను ఏకకాలంలో అనుమతిస్తుంది. దీంతో భద్రతా ఏజెన్సీల ఎలక్ట్రానిక్ మానిటరింగ్ సమస్యాత్మకంగా మారుతుంది. దీంతో ఉగ్రవాదులు వైఎస్ఎంఎస్ టెక్నాలజీని విరివిగా వాడుతున్నారు. దీంతో పాక్ పంపే సిగ్నల్స్‌తో పీవోకేలోని హ్యాండ్లర్లు, చొరబాటుదారులు, వారికి ఆశ్రయం ఇచ్చే వారితో నిరంతరం టచ్‌లో ఉంటున్నారు. ఈ అక్రమ విధానాలతో పాకిస్థాన్ ఐరాస అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ యూనియన్ రాజ్యాంగంలోని 45 ఆర్టికల్‌ను ఉల్లంఘిస్తోందని అధికారులు వెల్లడించారు. ఈ ఆర్టికల్ ప్రకారం ఒప్పందంపై సంతకాలు చేసిన మొత్తం 193 దేశాలు తమ భూభాగం నుంచి అధిక, రోగ్, తప్పుడు, తప్పుదోవ పట్టించే సంకేతాలు పక్కదేశాల్లోకి వెళ్లకుండా సహకరించుకోవాలి.

## సాయుధ దళాల వ్యవస్థీకృత సంస్కరణలపైనే దృష్టి: కొత్త సీడీఎస్ రాజా సుబ్రమణి



భారత నూతన చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్)గా జనరల్ రాజా సుబ్రమణి నేడు బాధ్యతలు స్వీకరించారు. మాజీ సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ ఆయనకు బాధ్యతలను అప్పగించారు. దీంతో మిలటరీ థియేటరైజేషన్ బాధ్యతలను ఇక నుంచి సుబ్రమణి పర్యవేక్షించనున్నారు. వీటి ద్వారానే భారత త్రివిధ దళాల్లో సమన్వయం పెరుగుతుందని అంచనావేస్తున్నారు.

జనరల్ రాజా సుబ్రమణి చైనా, పాకిస్థాన్ అంశాల్లో నిపుణుడిగా సైనిక వర్గాల్లో పేరుంది. ఆయన నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటేరియట్‌కు మిలిటరీ అడ్వైజర్‌గా కూడా పనిచేశారు. వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీస్టాఫ్‌గానూ బాధ్యతలు నిర్వహించారు. తాజా బాధ్యతల్లో ఆయన ఇంటిగ్రేటెడ్ మిలిటరీ కమాండ్స్ ఏర్పాటుతో.. థియేటరైజేషన్ ప్రక్రియను కూడా పూర్తి చేయాల్సి ఉంటుంది. మరోవైపు సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ పదవీ కాలం శనివారంతో ముగిసింది.

సీడీఎస్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత జనరల్ రాజా సుబ్రమణి మీడియాతో మాట్లాడారు. "దేశ సార్వభౌమత్వం, జాతీయ ప్రయోజనాలు కాపాడటానికి సైనిక దళాలు పూర్తిగా కట్టుబడి ఉన్నాయన్నారు. దళాలు దేశ సేవ కోసం పూర్తి అంకితభావంతో పనిచేస్తాయని తాను హామీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

నేవీ చీఫ్‌గా అడ్మిరల్ స్వామినాథన్ బాధ్యతల స్వీకరణ

నేవీ చీఫ్‌గా అడ్మిరల్ స్వామినాథన్ ఆదివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఈ స్థానంలో ఉన్న డీకే త్రిపాఠీ పదవీకాలం శనివారంతో ముగిసిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు స్వామినాథన్ వెస్ట్రన్ నేవల్ కమాండ్‌కు ఫ్లాగ్ ఆఫీసర్ కమాండ్ ఇన్ చీఫ్‌గా బాధ్యతలు నిర్వహించారు. దేశ ప్రయోజనాలు కాపాడేందుకు పూర్తిగా కట్టుబడి ఉంటానని ఈ సందర్భంగా కొత్త నేవీ చీఫ్ వెల్లడించారు.

## గాజియాబాద్‌లో సంచలనం.. మిత్రుడిని హత్య చేసిన యువకుడి ఎన్‌కౌంటర్..!

గాజియాబాద్‌లో ఉద్రిక్తతలకు కారణమైన ఓ హత్య కేసులో నిందితుడు శనివారం అర్ధరాత్రి పోలీసుల ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయాడు. కొన్నాళ్ల క్రితం సూర్యప్రతాప్ చౌహాన్ (17) అనే యువకుడిని అతడి మిత్రుడు అసద్ మరికొందరితో కలిసి కత్తితో పొడిచి హత్య చేశాడు. ఈ దాడి అనంతరం అతడు పరారయ్యాడు. దీంతో పోలీసులు అతడిపై రూ.50,000 రివార్డ్ ప్రకటించారు.

శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత నిందితుడు అసద్ ఓ మిత్రుడి వద్ద డబ్బులు తీసుకోవడానికి ఖోడా అనే ప్రదేశానికి వస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. అతడు నగరం నుంచి పారిపోవాలని ప్లాన్ చేసినట్లు గుర్తించారు. నిందితుడి కోసం పోలీసులు ఇందిరాపురంలో వలపన్నారు. బైక్‌పై అసద్ రాగానే లొంగిపోవాలని పోలీసులు హెచ్చరించారు. అయినా.. అతడు లెక్కచేయకుండా పోలీసులపైకి కాల్పులు జరపడంతో.. వారు ఎదురు కాల్పులు మొదలుపెట్టారు. తూటా అసద్‌కు తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనా స్థలం నుంచి ఓ నాటు తుపాకీ, బైక్ స్వాధీనం చేసుకొన్నారు. అసద్ మిత్రుడు అక్కడి నుంచి తప్పించుకోవడంతో అతడి కోసం గాలింపు చేపట్టారు.

**పాతగొడవ నేపథ్యంలో..**

అసద్, సూర్య మధ్య కొన్ని నెలల క్రితం ఓ విషయంపై గొడవ జరిగింది. దీనిని మనసులో పెట్టుకొన్న అసద్ బక్రీద్ రోజున సూర్యను ఇంటికి ఆహ్వానించాడు. అతడు వచ్చాక.. కత్తితో పొడిచి హత్య చేశాడు. ఈ ఘటన గాజియాబాద్‌లో తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది.

# అవి భారతీయులకు గర్వకారణం..

మొదటిపేజీ తరువాయి

ప్రధాని మోదీ ఈ సంఘటనను కూడా మన్‌కీ బాత్‌లో మాట్లాడారు. గంటలపాటు శ్రమించి డాల్ఫిన్‌ను కాపాడినవారిని అభినందించారు. ఈ సహాయక చర్యల్లో కేంద్రం ఇటీవల కొత్తగా ప్రవేశపెట్టిన డాల్ఫిన్ అంబుల్స్ కీలకపాత్ర పోషించినట్లు తెలిపారు. కేరళలోని ఆలువా ప్రాంతంలో స్విమ్మింగ్ క్లబ్ సేవలను మోదీ ప్రశంసించారు. ఈ క్లబ్ ద్వారా ఇప్పటి వరకు 15వేల మందికి పైగా శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

ఎండలో జాగ్రత్త..

ఎండల తీవ్రత దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మోదీ పలు సూచనలు చేశారు. బయటకు వెళ్లాల్సి వస్తే తాగునీరు వెంట ఉంచుకోవాలన్నారు. ఆయా రాష్ట్రాల్లో ఎండల నుంచి రక్షణ కోసం వాడే పానీయాలు మామిడి పండ్లు, మజ్జిగ, షర్బత్, బేల్‌పనా గురించి ప్రస్తావించారు.

## టీఎంసీ అంతర్గత కుమ్ములాటలే అభిషేక్ బెనర్జీపై దాడికి కారణం: భాజపా

మొదటిపేజీ తరువాయి

తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ, మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై దాడికి వారి పార్టీలోని అంతర్గత కుమ్ములాటలే కారణమని భాజపా పేర్కొంది. ఈ మేరకు భాజపా నేత ప్రదీప్ భండారీ పలు ఆరోపణలు చేస్తూ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. "అభిషేక్ బెనర్జీపై దాడికి టీఎంసీ అంతర్గత వర్గాలే కారణమా..? అరెస్ట్ అయిన ఆరుగురు నిందితులు మాజీ ఎమ్మెల్యే లవ్లీ మొయిత్రాకు సన్నిహిత సహాయకులే. టీఎంసీ శ్రేణులే అభిషేక్‌కు వ్యతిరేకమయ్యాయా? భాయ్‌పో (బెంగాల్‌లో మేనల్లుడు)పై ఏ స్థాయిలో వ్యతిరేకత ఉందో ఊహించుకోండి" అని పేర్కొన్నారు. మరోవైపు పశ్చిమబెంగాల్ మంత్రి అగ్నిమిత్ర పాల్ కూడా టీఎంసీ ఆరోపణలను తోసిపుచ్చారు. టీఎంసీపై ఉన్న ప్రజాగ్రహానికి ఈ ఘటన అద్దంపడుతోందన్నారు. "ఈ రోజుల్లో మనం నిజమైన ప్రజాగ్రహం చూస్తున్నాం. కొన్నేళ్లుగా మమతా, అభిషేక్, టీఎంసీ హింసాత్మక రాజకీయాలకు పాల్పడ్డారు. ఇప్పుడు కూడా వారు అటువంటి వాటికి యత్నిస్తే మాత్రం చూస్తూ ఊరుకోము" అని హెచ్చరించారు. హంతకులు ఎవరో ప్రజలు చెబుతున్నారని అగ్నిమిత్ర పాల్ వ్యాఖ్యానించారు. అభయా ఎలా చనిపోయింది..? మహిళలు గత 15 ఏళ్లుగా హింసను ఎలా అనుభవించారు? కమ్దునీ, పార్క్ స్ట్రీట్‌లలో వందల మంది మా పార్టీ కార్యకర్తలను హత్య చేసి చెట్లకు వేలాడదీసింది చూడాలి. అభివృద్ధి లక్ష్యంతోనే కొత్త ప్రభుత్వం వచ్చింది. రాష్ట్ర ప్రగతి కోసం కలిసి జట్టులా పనిచేద్దాం" అని పేర్కొన్నారు.

# ఆన్‌మార్క్ పోర్టల్..

### లోపాలు పరిశీలిస్తున్నాం : సీబీఎస్ఈ

మొదటిపేజీ తరువాయి

"ఆన్‌మార్క్ పోర్టల్‌లో వెలుగు చూస్తోన్న లోపాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నాం. ఈ వ్యవస్థలను పటిష్ఠం చేయడానికి గత కొన్ని రోజులుగా ఐఐటీలు, వివిధ ప్రభుత్వ విభాగాలతో కూడిన సైబర్ సెక్యూరిటీ నిపుణులు ప్రయత్నిస్తున్నారు. వ్యవస్థను మరింత సురక్షితంగా మార్చేందుకు కృషి చేస్తున్నారు. ఇప్పటికే గుర్తించిన లోపాలను సరిచేశారు. ఇంకా ఏమైనా లోపాలు ఉన్నాయా? అనేది పరిశీలిస్తూ కట్టడి చేసే పనిలో ఉన్నారు. ఈ వ్యవహారంలో అప్రమత్తంగా ఉంటూ లోపాలను ఎత్తిచూపుతున్న పౌరులు, ఎథికల్ హ్యాకర్లందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. వారిలో కొందరిని సంప్రదించాం. మరేదైనా సమాచారం ఉంటే సైబర్ భద్రతా విభాగాన్ని సంప్రదించవచ్చు" అని ఎక్స్ వేదికగా సీబీఎస్ఈ సూచించింది.

# ఎన్నిసార్లు దొరికిపోయినా..

### కుట్ర రాజకీయాలు మానరా?: నారా లోకేశ్

మొదటిపేజీ తరువాయి

ఆదివారం సెలవు రోజున కొద్దిపాటి సమయం దొరకడంతో తనకు ఇష్టమైన వ్యవసాయ పనుల్లో పాల్గొన్నట్లు మంత్రి నిమ్మల చెప్పారు. సొంత వ్యవసాయ పనుల్లో కార్మికులతో కలిసి పనిచేయడం ఎంతో సంతృప్తిగా ఉంటుందన్నారు. షెడ్యూల్ ప్రకారం ఆదివారం గోదావరి డెల్టాకు సాగు నీరు విడుదల చేశామని చెప్పారు. రైతులందరూ ముందస్తుగా వరి నాట్లు వేసేందుకు సిద్ధం కావాలని సూచించారు. ఎల్‌నినో నేపథ్యంలో సాగు నీటిని సక్రమంగా వినియోగించుకుంటూ జల సంరక్షణ చేపట్టాలని పిలుపునిచ్చారు.

## రైతు డిస్కం పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి కొత్త నాటకం: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: రైతు డిస్కం.. అన్నదాతల పాలిట శాపంగా మారనుందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఈ డిస్కం వల్ల తాగునీటి ప్రాజెక్టులకు కూడా కరెంట్ కోతలు వస్తాయని చెప్పారు. ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి తీరుపై మండిపడ్డారు.

"ప్రస్తుతం రైతులకు రోజుకు 13 గంటలకు మించి కరెంట్ ఇవ్వట్లేదు. రైతు డిస్కం ఏర్పాటుతో 7–8 గంటలే ఇచ్చేందుకు కుట్రలు చేస్తున్నారు. గుజరాత్‌లో రైతులకు 7 గంటలే విద్యుత్ ఇస్తున్నారు. బడే భాయి మోదీ విధానాలనే అమలు చేసేందుకు ఛోటా భాయి యత్నిస్తున్నారు. రైతు డిస్కంలో సౌర విద్యుత్ మాత్రమే ఇస్తామని జీవోలో పేర్కొన్నారు. ఆ విద్యుత్‌తో ఎత్తిపోతల ప్రాజెక్టుల మోటార్లు ఎలా నడుస్తాయి?"అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

# రైతు డిస్కం ఏర్పాటు వెనుక కుట్ర ఉంది: కవిత

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, మీటర్లు బిగించబోమన్న సీఎం.. ఆ విషయాన్ని మీడియా చిట్‌చాట్‌లో కాకుండా అధికారికంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

రైతు డిస్కం ఏర్పాటు చేయడం వెనుక మిగిలిన రెండు డిస్కంలను ప్రైవేటీకరించే కుట్ర దాగి ఉందని ఆరోపించారు. ఈ కుట్రను అడ్డుకునేందుకు సుప్రీంకోర్టు వరకైనా వెళ్తామని స్పష్టం చేశారు. కేంద్రం తెచ్చిన కొత్త సోలార్ జీవో.. బడా కార్పొరేట్ సంస్థలకే మేలు చేస్తోందని ధ్వజమెత్తారు.

ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం వల్ల 18 రోజుల పసికందు చేయి కోల్పోయిన ఘటన దారుణమన్నారు. సీఎం, ఖమ్మం జిల్లా మంత్రులు బాధ్యత వహించి ఆ చిన్నారి పేరిట రూ.25 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని డిమాండ్ చేశారు. దసరా నాటికి లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును ప్రతిపాదించకపోతే పాదయాత్ర చేపడతామని హెచ్చరించారు.

# స్వచ్ఛంద సేవతో ఆకట్టుకున్న వీరశైవ లింగాయత్ సంఘం

- నిరంతరంగా కొనసాగుతున్న మజ్జిగ సేవా కార్యక్రమం
- మండుటెండలో మజ్జిగతో ఊరట..
- వీరశైవ సంఘుకు ప్రజల ప్రశంసలు
- మజ్జిగ సేవ రోజు 500 మందికి చల్లని మజ్జిగ పంపిణీ

**ఎల్కతుర్తి మే 31(జనసముద్రం)**

హనుమకొండ చౌరస్తా లోకల్ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో మండుటెండలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు వీరశైవ లింగాయత్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మజ్జిగ పంపిణీ సేవా కేంద్రం విశేష ఊరటనిచ్చింది. చల్లని మజ్జిగను సేవించిన చిరు వ్యాపారులు, ప్రయాణికులు, స్థానిక ప్రజలు సంఘం ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలుపుతూ సేవలను అభినందించారు.మే 8వ తేదీ నుంచి మే 31 వరకు మొత్తం 24 రోజుల పాటు కొనసాగిన ఈ కార్యక్రమంలో ప్రతిరోజూ సుమారు 500 మంది వరకు మజ్జిగను సేవించి సంతృప్తి వ్యక్తం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మండుతున్న ఎండల మధ్య ప్రజలకు ఉపశమనం కలిగించిన ఈ సేవ కార్యక్రమం అందరికీ ఆదర్శప్రాయమని స్థానిక వ్యాపార వర్గాలు పేర్కొన్నాయి.







దాతల సహకారం, సంఘం ప్రతినిధుల సమన్వయంతో గత మూడు సంవత్సరాలుగా ఈ స్వచ్ఛంద సేవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని సంఘం ప్రతినిధులు తెలిపారు. ఆదివారం 31తో మజ్జిగ పంపిణీ సేవా కార్యక్రమాన్ని ముగిస్తున్న సందర్భంగా సహకరించిన ప్రతి దాతకు, సంఘం సభ్యులకు, ప్రత్యక్షంగా--పరోక్షంగా తోడ్పడిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా చలివేంద్రం నిర్వహించేందుకు అనుమతి ఇచ్చిన ఆర్టీసీ లోకల్ డిపో మేనేజర్ ధరమ్ సింగ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి అయోధ్య ఫారన్ ఎడ్యుకేషన్ చైర్మన్ మద్దెల ప్రశాంత్, దర్గా వాస్తవ్యులు శీలం రంజిత్ కుమార్--అనూష దంపతులు స్వచ్ఛందంగా దాతలుగా స్పాన్సర్ చేయడం అభినందనీయమని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పట్నం శెట్టి వీర సోమయ్య, నానం రాజయ్య, పెనాల సమ్మయ్య, కమ్మల సర్వేశ్వరరావు, పట్నం శెట్టి గౌరీ శంకర్, దుర్గం సమ్మయ్య, సాయం ఉష జ్ఞానేశ్వర్, సాయం ఈశ్వరయ్య, మారెళ్ళ ఉమా గంగాధర్, ఉప్పు శివకుమార్ (సునీల్), హనుమకొండ జిల్లా జంగమ సమాజం వర్కింగ్ ప్రెసిడెంట్ కోగిలవాయి మఠం సురేష్ బాబు, శ్రీమతి కోగిలవాయి ఉమ, మఠం రాజేష్, జూలపల్లి మఠం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గత 24 రోజులుగా నిర్వహించిన ఈ సేవా కార్యక్రమానికి సంఘం గౌరవ సలహాదారు గుండవరం విధుమౌళి సమన్వయకర్తగా వ్యవహరించారు.

# బాల్క సుమన్ వ్యాఖ్యల వెనుక కేసీఆర్ కుట్ర ఉంది

- టీపీసీసీ సభ్యులు బొమ్మనపల్లి అశోక్ రెడ్డి
- ఆరోపణలు
- బాల్క సుమన్ అరెస్ట్ సమంజసం : టీపీసీసీ నేత
- రైళ్లపై దాడులు ప్రజలపై దాడులే : అశోక్ రెడ్డి
- బీఆర్ఎస్ నేతల రెచ్చగొట్టే రాజకీయాలు : కాంగ్రెస్
- బాల్క సుమన్‌పై పీడీ యాక్ట్ పెట్టాలి : బొమ్మనపల్లి
- కాంగ్రెస్ ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే పోరాటం చేస్తుంది

**ఎల్కతుర్తి మే 31 (జనసముద్రం)**



మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేయడం సరైన చర్యేనని టీపీసీసీ సభ్యులు బొమ్మనపల్లి అశోక్ రెడ్డి పేర్కొన్నారు. సింగరేణిపై చేసిన అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారని తెలిపారు.ఈ సందర్భంగా అశోక్ రెడ్డి మాట్లాడుతూ, "ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే జైలుకు పంపుతున్నారని బాల్క సుమన్ ఆరోపించడం ఎంతవరకు సమంజసం? ఆయన అరెస్ట్‌కు కారణం ఆయన మాటలే" అని విమర్శించారు.బాల్క సుమన్ వ్యాఖ్యల వెనుక బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుట్ర దాగి ఉందని ఆరోపించిన ఆయన, "కేసీఆర్ తన రాజకీయ ప్రయోజనాల కోసం బాల్క సుమన్‌ను వాడుకుంటున్నారు. దమ్ము, ధైర్యం ఉంటే కేటీఆర్ లేదా హరీష్ రావుతో ఇలాంటి వ్యాఖ్యలు చేయించాలి. కానీ దళిత నాయకుడైన బాల్క సుమన్‌ను ముందుకు నెట్టి చట్టాలకు వ్యతిరేకంగా మాట్లాడిస్తున్నారు" అని అన్నారు."కాంగ్రెస్ పార్టీ సంస్కారం గౌరవప్రదమైన రాజకీయాలను నేర్పింది. అందుకే మేము ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే నిరసనలు చేపడతాం. బీఆర్ఎస్ నేతలు మాత్రం నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారు" అని మండిపడ్డారు.రైళ్లపై దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండించిన అశోక్ రెడ్డి, "రైళ్లలో ప్రయాణించేది సాధారణ ప్రజలే. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేదలే ఎక్కువగా ప్రయాణిస్తారు. ప్రజలు ఓట్లు వేయలేదని వారిపై కోపం చూపడం సరైంది కాదు" అన్నారు.అలాగే, "తెలంగాణలో శాంతిభద్రతలకు విఘాతం కల్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. బాల్క సుమన్ లాంటి వ్యక్తులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలి" అని డిమాండ్ చేశారు.ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు తెలిపిందని, కానీ ప్రస్తుతం బీఆర్ఎస్ నేతలు రెచ్చగొట్టే రాజకీయాలకు పాల్పడుతున్నారని అశోక్ రెడ్డి విమర్శించారు.

# వల్లభాపురం లో విషాద ఛాయలు:అంగన్‌వాడీ ఆయా సుశీల మృతి

- చిన్నారుల సేవలో జీవితాన్ని అంకితం చేసిన సుశీల

**ఎల్కతుర్తి మే 31(జనసముద్రం)**

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వల్లభాపూర్ గ్రామానికి చెందిన అంభాల సుశీల (అంగన్‌వాడీ ఆయా) అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వడదెబ్బ కారణంగా శనివారం సాయంత్రం మృతి చెందారు.ఆమె మృతి గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది.వల్లభాపూర్ గ్రామంలో ప్రారంభమైన తొలి అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా బాధ్యతలు చేపట్టిన సుశీల ఎన్నో సంవత్సరాల పాటు చిన్నారులకు సేవలందించారు. ఆమె చేతుల్లో పెరిగిన అనేక మంది విద్యార్థులు నేడు ప్రభుత్వ, ప్రైవేటు



అంబాల సుశీల

రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉద్యోగాలు నిర్వహిస్తున్నారు. చిన్నారుల పట్ల ఆమె చూపిన మమకారం, సేవాభావం గ్రామ ప్రజల మన్ననలు పొందింది.సుశీల మృతి ఆమె కుటుంబ సభ్యులకు, గ్రామ ప్రజలకు తీరని లోటుగా మారింది.మృతురాలికి నలుగురు కుమారులు ఉన్నారు. వారిలో ఒకరి కోడలు మాజీ సర్పంచ్‌గా సేవలందించగా, మరో కుమారుడు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఇంకొక కుమారుడు ఎల్కతుర్తిలో బుక్‌స్టాల్ నిర్వహించడంతో పాటు పత్రికా విలేకరిగా సేవలందిస్తున్నారు.విలేకరి తల్లి మృతి వార్త తెలుసుకున్న పలువురు జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులు కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.సుశీల చేసిన సేవలను స్మరించుకుంటూ ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వల్లభాపూర్ గ్రామంలో తొలి అంగన్‌వాడీ ఆయాగా సేవలందించిన అంభాల సుశీల మృతి గ్రామానికి, ముఖ్యంగా చిన్నారుల సంక్షేమం కోసం ఆమెతో కలిసి పనిచేసిన వారందరికీ తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఆమె సేవలు గ్రామ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి.

# ఎన్‌హెచ్-563పై సూరారం గ్రామానికి బైపాస్ కోసం వినతి

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి గ్రామ పంచాయతీ నుంచి వినతిపత్రం

**ఎల్కతుర్తి, మే 31 (జనసముద్రం)**

హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని సూరారం గ్రామ ప్రజల దీర్ఘకాలిక సమస్య పరిష్కారానికి మరో కీలక అడుగు పడింది.ఎన్‌హెచ్-563 జాతీయ రహదారిపై సూరారం గ్రామానికి బైపాస్ రోడ్డు, సర్వీస్ రోడ్డు మంజూరు చేయాలని కోరుతూ కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి కి గ్రామ పంచాయతీ తరఫున వినతిపత్రం అందజేశారు.గ్రామ అభివృద్ధి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ గ్రామ ప్రజల సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లిన డాక్టర్ ప్రేమానందరావుకు, అలాగే బీజేపీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ సి.ఎన్. గౌతమ్



రావుకు సూరారం గ్రామ ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా సూరారం గ్రామంలోని శ్రీ కోదండ రామాలయానికి సంబంధించిన బ్రోచర్‌తో పాటు గ్రామ సర్పంచ్ శ్రీమతి భాషబోయిన నీలా సంతకం చేసిన గ్రామ పంచాయతీ వినతిపత్రాన్ని కేంద్ర మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డికి అందజేశారు.వినతిని సానుకూలంగా స్వీకరించిన కేంద్ర మంత్రికి గ్రామ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఎన్‌హెచ్-563పై సూరారం గ్రామ ప్రజల రాకపోకలకు అనుకూలంగా బైపాస్, సర్వీస్ రోడ్డు నిర్మాణం జరిగితే ప్రమాదాలు తగ్గడంతో పాటు ప్రాంతీయ అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుందని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు.అలాగే శ్రీ కోదండ రామాలయ అభివృద్ధి, గ్రామ ప్రజల సౌకర్యాల పెంపు కోసం అందరూ ఇదే విధంగా సహకరించాలని ఆలయ భక్తులు కోరుతున్నారు.సూరారం గ్రామానికి బైపాస్, సర్వీస్ రోడ్డు మంజూరు సాధించి తీరుతామనే విశ్వాసంతో గ్రామ ప్రజలు ఎదురు చూస్తున్నారు.త్వరలోనే కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుని గ్రామ ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# మానుకోట లో గ్యాస్ట్రో ఎంట్రాలజీస్ట్ ఢ హెపటాలజిస్ట్ హాస్పిటల్ ప్రారంభోత్సవం

- గ్యాస్ట్రో లివర్, పాంక్రియాస్ సెంటర్ ప్రారంబోత్సవం

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జన సముద్రం న్యూస్ మే 31**

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రెడ్డిబజార్ ప్రముఖ గ్యాస్ట్రోఎంట్రాలజీస్ట్ ఢ హెపటాలజిస్ట్ డాక్టర్ రాంపల్లి విజయ్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన విజయ్ గ్యాస్ట్రో లివర్, పాంక్రియాస్ సెంటర్ ప్రారంబోత్సవ కార్యక్రమంలో బాగంగా స్పేషల్ రూం ను ప్రారంభించిన
అనంతరం డాక్టర్ విజయ్ రాంపల్లి కి ఆత్మీయ సత్కారం చేసిన టియుడబ్ల్యూజే (ఐజేయు) మహబూబాబాద్




జిల్లాఅధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్, జిల్లాప్రధాన కార్యదర్శి గాడిపల్లి శ్రీహరి, కేజికేఎస్ మహబూబాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి యమగాని వెంకన్నగౌడ్, కేజికేఎస్ అధికార ప్రతినిధి గాడిపల్లి శ్రీనివాస్, బొమ్మగాని నారాయణ, రాము, మోహన్, శ్రీనివాస్, మహేష్, హాస్పిటల్ సిబ్బంది తదితరులు...

# నకిలీ పత్తి విత్తనాల విక్రయంపై పోలీసుల దాడి -- 28 కేజీల విత్తనాలు స్వాధీనం

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జన సముద్రం న్యూస్ మే 31**

మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం టీక్యా తండాలో నకిలీ పత్తి విత్తనాల విక్రయం జరుగుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు తొర్రూర్ పోలీసులు, సీసీఎస్ బృందం సంయుక్తంగా ప్రత్యేక దాడి నిర్వహించారు. ఈ దాడిలో 28 కేజీల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు.

పోలీసుల ప్రాథమిక విచారణలో టీక్యా తండాకు చెందిన జాటోత్ వెంకన్న నకిలీ పత్తి విత్తనాలను రైతులకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అలాగే అతనికి అతని అల్లుడు బర్మావత్ సోమన్న నకిలీ విత్తనాలను సరఫరా చేస్తున్నట్లు వెల్లడైంది. నకిలీ విత్తనాల విక్రయం ద్వారా అమాయక రైతులను మోసం చేస్తూ అక్రమ లాభాలు పొందుతున్నట్లు తేలడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులను మోసం చేసే నకిలీ విత్తనాల ముఠాలపై ప్రత్యేక నిఘా ఉంచామని పోలీసులు పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై నిరంతర తనిఖీలు నిర్వహించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా



వ్యవహరించి నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించిన తొర్రూర్ సీఐ, సీసీఎస్ సీఐతో పాటు పోలీసు సిబ్బందిని తొర్రూర్ డీఎస్పీ అభినందించారు.

రైతులు విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, ప్రభుత్వ అనుమతి పొందిన విక్రయ కేంద్రాల నుంచే విత్తనాలను కొనుగోలు చేయాలని, అనుమానాస్పదంగా కనిపించే విత్తనాల విక్రయాలపై వెంటనే పోలీసులకు లేదా వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

# తెలంగాణ రాష్ట్ర కార్పోరేషన్ చైర్మన్ గా ఎన్నికైన సందర్భంగా మర్రిగూడెంలో సయ్యద్ అజ్మతుల్లా ఆధ్వర్యంలో శాలువా పూలదండలతో గజ మాలలతో ఘన సన్మానం

**జన సముద్రం న్యూస్ జూన్ 1 సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ నియోజకవర్గ రిపోర్టర్ అలవాల రవి**

మండలంలోని మర్రిగూడెంగ్రామంలో తెలంగాణ రాష్ట్రం కార్పొరేషన్ చైర్మన్ గా ఎన్నికైన శ్రీ దొంగరి వెంకటేశ్వర్లు ఎన్నికైన సందర్భంగా వారికి శాలువా పూలదండ లతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు సర్పంచ్ షేక్ నజీమా పాషా తోట బిక్షం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉప సర్పంచ్ ఆదినారాయణ గ్రామ శాఖ అధ్యక్షులు ఎస్కే మౌలానా సయ్యద్ ఇబ్రహీం సయ్యద్ రబ్బాని నిమ్మల ఆదినారాయణ కోట కోటేశ్వరరావు వేణుగోపాల్ షేక్ అల్లా బక్స్ మై నిద్దీన్ మీరాస ఎస్. డి మొయినుద్దీన్ వెంకట నరసయ్య తోట శ్రీను జి నాగరాజు మల్లేష్ పి నాగరాజు గల్ల శ్రీను పి శ్రీను ఎస్.కె అస్సామీయ ప్రసాద్ ఆ సాయి



పి అంజి ఎస్ కే రహీం షేక్ ముస్తఫా ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు

# ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం: సబ్‌జైల్లో రిమాండ్ ఖైదీలతో ప్రతిజ్ఞ

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జన సముద్రం న్యూస్ మే 31**

మహబూబాబాద్ జిల్లాలో
మే 31 న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ స్థానిక సబ్‌జైల్లో ఆదివారం రిమాండ్ ఖైదీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ వి. రాజ్ కృష్ణ
?ఖైదీలను ఉద్దేశించి మాట్లాడుతూ, పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల కలిగే నష్టాలను, ప్రాణాంతక వ్యాధుల గురించి వివరించారు. ధూమపానం, గుట్కా వంటి అలవాట్లు మనిషి ఆరోగ్యాన్నే కాకుండా, వారి కుటుంబాలను కూడా ఆర్థికంగా, సామాజికంగా రోడ్డున పడేస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. జైలు జీవితం అనేది ఒక పరివర్తనకు వేదిక కావాలని, ఇక్కడి నుంచి బయటకు వెళ్లేటప్పుడు చెడు అలవాట్లను వీడి, ఆదర్శవంతమైన పౌరులుగా మారాలని పిలుపునిచ్చారు.
?అనంతరం విచారణ ఎదురకొంటున్న నిందితులందరితో కలిసి పొగాకు వ్యతిరేక ప్రతిజ్ఞ




చేయించారు. పొగాకు వంటి దుర్వ్యసనాలకు బానిసై వాటి నుంచి బయటపడాలని కోరుకునే వ్యక్తులకు ప్రభుత్వ ఆసుపత్రిలో డి అడిక్షన్ సెంటర్ తగిన సహాయం అందిస్తుందని ఆయన తెలిపారు. జీవితంలో మరెప్పుడూ పొగాకు ఉత్పత్తులను ముట్టుకోబోమని, తమ కుటుంబాల క్షేమం కోసం ఆరోగ్యకరమైన జీవనాన్ని సాగిస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.

# గంగమ్మ తల్లి దేవాలయం నిర్మాణం కోసం భూ సేకరణ

## గంధంపల్లి కొత్తపేట సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ ఆధ్వర్యంలో

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జన సముద్రం న్యూస్ మే 31**



మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం
గంధంపల్లి కొత్తపేట గ్రామపంచాయతీ పరిధిలోని యాదవ కులస్తులు తమ ఆరాధ్య దైవం కులదేవత అయినటువంటి గంగమ్మ తల్లి దేవాలయం నిర్మాణం చేయుట కొరకు భూక్య ప్రవీణ్ నాయక్ సర్పంచ్ ని కోరగా వారు స్పందించి దేవాలయం నిర్మాణం కొరకు కావలసిన భూసేకరణ కొరకు వీసం రామ్మూర్తి ని కోరగా వారు వారి సొంత స్థలమైన గుట్టపైన భూమిని దానం చేయుటకు అంగీకరించినందున అట్టి భూమిని సందర్శించడం జరిగినది ఈ కార్యక్రమంలో యాదవ కులస్తులు అందరూ మరియు భూక్య ప్రవీణ్ నాయక్ సర్పంచ్ ప పాల్గొని భూదాత అయిన వీసం రామ్మూర్తి ని సవినయంగా అభినందిస్తూ వారి ఆశీర్వాదాలు తీసుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో యాదవ కులస్తులైన చిన్నబోయిన వెంకన్న, పరిటాల సురేష్, ఎర్రగడ్డ రాజు, చిర్ర లింగయ్య, చిర్ర కొండలరావు, ఎర్రగడ్డ వెంకన్న, చిర్ర మల్లేశం, ఎర్రగడ్డ శ్రీను, చిన్నబోయిన శీను, పరిటాల నరేష్ తదితరులు పాల్గొనడం జరిగింది

# కుందుర్పిలో కాలగర్భంలో కలిసిపోయిన పురాతన శివాలయం.

- కుందుర్పి లో ధ్వంసం అయిన బల్లె వారి మఠం.
- కొన్ని వందల సంవత్సరాల క్రితం నిర్మితమైన బల్లెవారి మఠం.
- 28 స్తంభాల పైన వెలిసిన మఠం.
- 2010లోప్రాచిన బల్లె వారిమఠం.
- శివశక్తులు ఐక్యతకు శ్రీ చక్రం సూచిస్తుంది.
- మరమ్మతుల కోసం రూ,6,00,000 నిధులు మంజూరు...

**కుందుర్పి, మే, 31,జనసముద్రం న్యూస్ :**

మండల కేంద్రమైన కుందుర్పిలో మార్కెట్ లో వెలసిన ప్రాచిన శ్రీ భల్లేవారి మఠం ఇటీవల కాలంలో కుప్పకూలిపోయినది. ఆలనాడు కుందుర్పిలో యర్రగుంటస్వామి మఠం,,బల్లేవారి మటం,శరంతమటం, నాలుగు మఠాలు వెలిసాయి. మఠం అంటే ఒక రకమైన ఆధ్యాత్మిక సంస్థ.ఇది హిందూ, బౌద్ధ జైన సిక్కు మతాలకు చెందిన సంస్థ. ఒక మతసంస్థ విద్యాలయం ,విహారప్రదేశం, యాత్రీకులుకు ఆశ్రమం.తీర్థాస్థలం అని అర్థాలు వున్నాయి. హిందూ మతంలోని సన్యాసులు, బబౌద్ధ,జైన మతాలులోని బిక్షువులు సిక్కు మతంలోని సాదవులు తమ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు శిష్యలుకు ఆధ్యాత్మిక విద్యాను బోధించడానికి ,తమ మత ప్రచారానికి మత విద్యాసానికి , సేవాకార్యక్రమాలు కు ఉపయోగించే సంస్థ మఠం. మఠాధిపతిని



మఠాధీశుడు, మఠాధీశులు అని అంటారు.గతంలో వీరి నేతృత్వంలోనే పైకార్యక్రమాలు కోన సాగిన విషయం విదితమే. కుందుర్పి గ్రామం 4,615హెక్టరులులో గ్రామం విస్తరించి ఉంది. ఆలనాడు రాజుల కాలంలో రాజులు వారి నేతృత్వంలో శివాలయం ఇక్కడ నిర్మించినది కాలగర్భంలో కలిసిపోయింది. ఈ శివాలయం నాడు సుందరంగా నిర్మించినది నేడు ఘన చరిత్ర పురాతన ఆలయం శిధిలా వ్యవస్థకు చేరింది. గర్భగుడిలోని శివలింగం కానీ ,పాణివట్టం కానీ ఆనవాళ్లు లేకుండా ధ్వంసం చేశారు. ఈ ఆలయం మండపము 28 సుందరమైన రాత్రి స్తంభాలపైన గత వందల సంవత్సరాల క్రితం ఆలయాన్ని నిర్మించినట్లు తెలుస్తోంది. 2010లో అప్పటి రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వంచే పురవస్తు ప్రదర్శనలు శాల శాఖ ఏపీ ప్రభుత్వం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ ఆలయం జీర్ణోధర్మ పనులు నిమిత్తం రూ,ఆరు లక్షల అంచన వ్యయంతో మర్మమత్తు పనులు కోసం నిధులు మంజూరు చేశారు. మంట ప్రాంగణంలో తెల్లబండ్లును పరిచారు. ఈ ఆలయంను శివాలయం అని గుర్తించడానికి నంది రాతి విగ్రహాలను ఆనవాళ్లు నేటికీ ప్రత్యక్షంగా కనబడు తున్నాయి. ఈ ఆలయం మూడు ప్రాకారాలతో సువిశాలంగా వెలిసినది. ఉత్తర దిశగా ఆలయం వెలసగా. స్తంభాల పైన కుడి ప్రక్కన వినాయకుడు ,ఎడమ ప్రక్కన వీరభద్రుడు, దక్షుడు రాతి విగ్రహాలను అతి సుందరంగా కళాకారులు సహజ సిద్ధంగా కలవట్టిపడేలా చెక్కడం విశేషం. స్తంభాల పైన నంది, జంట పులి లు , పనుగులు అను సంతానం చేసుకున్నట్టు చిత్రాలు దర్శనం ఇస్తున్నాయి. ఈ శివాలయం గర్భగుడిలో కమల పుష్పం రెండో ప్రాంగణంలో శ్రీ చక్రం టాపుకు వెలిశాయి. స్తంభాలపైన లజ్జ గౌరీ ,ఏనుగులు, నందిని శివలింగం, నెమలి, నాగ బంధం ,సూర్య చంద్రులు, చిహ్నాలు ఉన్నట్టు ప్రత్యక్ష ఆనవాళ్లు చూపర్లకు కనిపిస్తున్నాయి నేటికీ. ఈ ఆలయం ఉత్తర దిశగా



ప్రధాన ద్వారం దిశలో ద్వారాలను వెలిశాయని గ్రామ పూర్వీకులు పెద్దుల ద్వారా సమాచారం తెలిసింది. భారతీయ ఆధ్యాత్మిక సంస్కృతిలో శ్రీ చక్రం ఒక విశిష్టత స్థానం ఉంది. సమస్త విషయంలో సృష్టి స్థితి లయ శక్తికి ప్రతీక తంత్ర శాస్త్రం. వ్యతిరేక దివ్య శక్తుల సంఘము అని సూచిస్తుంది. శ్రీ చక్ర మంత్రం అనేది లలిత త్రిపుర సుందరి దేవి నివాసస్థానంగా విశ్వశక్తికి ప్రత్యేకంగా భావించే అత్యంత పవిత్రమైన రేఖాగణిత చిహ్నం. ఇది 9 అంతర్గత త్రిభుజాల నవయువని కలయిక శివశక్తుల ఐక్యతను చూచిస్తుంది. శ్రీ శక్తి అంతరం ఇంట్లో ఉంచుకోవడం వల్ల ఐశ్వర్యం సానుకూలత సమస్యలు పరిష్కారం కలగడానికి కలుగుతుందని నమ్మకం. శ్రీ చక్రం అనేది ఆదిశక్తి ఆరాధనలో ఉపయోగించిన ప్రధాన యంత్రం. చక్రాన్ని మానవ శరీరానికి ప్రత్యేకంగా భావిస్తారు. ఈ ప్రతీక వాదనలోని ముఖ్య లక్షణాలను ఈ వ్యాసంలో చర్చించడం జరిగింది. ఈ మంత్రం లక్ష్మీదేవి పౌరాణిక నమూనాలో ఉంది. పురాతన కళా సంపద రాను రాను ఎవరు పట్టించుకోని వారు లేకపోగా కను మరుగవుతుంది. భవిష్యత్ భావితరాల కోసం మన వారసత్వ సంస్కృతిని చరిత్ర పరిరక్షణ కోసం మనమందరం కలిసి సంఘటితంగా కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ఆనంద్ పురావస్తు ప్రదర్శనశాల శాఖ అధికారులను సంప్రదించి బల్లేవారి మంఠం మర్మత్తులు చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు కోరారు.

# వైఎస్సార్సీపీ నేతల ఆరోపణలను తీవ్రంగా ఖండించిన తెలుగు యువత నాయకులు

- జగన్ పాలనలో 2.30 లక్షల ఉద్యోగాల పేరుతో నిరుద్యోగ యువతను పూర్తిగా మోసం చేశారు: తెలుగు యువత నాయకులు
- గతంలో ఉద్యోగాల కోసం పోరాడిన యువతపై కేసులు పెట్టిన వైఎస్సార్సీపీ నేతలు.. నేడు నీతులు మాట్లాడటం హాస్యాస్పదం
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీపై సీఎం చంద్రబాబు మొదటి సంతకం చేశారు: తెలుగు యువత
- ఎలాంటి అవినీతి, సిఫార్సులకు తావులేకుండా పారదర్శకంగా 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేశారు
- మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, టీచర్లకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ: తెలుగు యువత నాయకులు
- రాష్ట్రానికి వస్తున్న కంపెనీలు, ఉద్యోగాలపై సంఖ్యలతో సహా బహిరంగ చర్చకు సిద్ధమంటూ వైఎస్సార్సీపీకి తెలుగు యువత సవాల్
- గత ఐదేళ్లలో ఒక్క ఉద్యోగం ఇవ్వని వారు.. 16 వేల మందికి ఉద్యోగాలిచ్చిన ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరం: తెలుగు యువత నాయకులు
- గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సొంత నిధులతో జాబ్ మేళాలు నిర్వహించి 7,600 మందికి ఉద్యోగాలు కల్పించారు
- నియోజకవర్గానికి అశోక్ లేలాండ్ వంటి పరిశ్రమలను తిరిగి తీసుకువచ్చిన వ్యక్తి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు
- ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పనితీరు, ప్రజాదరణను చూసి ఓర్వలేకనే ప్రత్యర్థుల అబద్ధపు ప్రచారాలు




**గన్నవరం నియోజకవర్గ జనసముద్రం ప్రతినిధి సురేష**

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీ అభివృద్ధి పనులపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న ఆరోపణలను తెలుగు యువత నాయకులు తిప్పికొట్టారు. నిడమానూరు లోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో తెలుగు యువత కృష్ణా జిల్లా అధ్యక్షులు దండమూడి చౌదరి మాట్లాడుతూ, 2019 నుంచి 2024 వరకు జగన్మోహన్ రెడ్డి పాలనలో నిరుద్యోగ యువతకు అన్యాయం జరిగిందని, 2.30 లక్షల ఉద్యోగాల పేరుతో మోసం చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం నారాచంద్రబాబు నాయుడు మెగా డీఎస్సీపై మొదటి సంతకం చేసి, 16,347 పోస్టులను అత్యంత పారదర్శకంగా భర్తీ చేశారని ఆయన గుర్తు చేశారు. నిరుద్యోగులకు మేలు జరుగుతుంటే ఓర్వలేక వైఎస్సార్సీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, గతంలో ఉద్యోగాల కోసం పోరాడిన యువతపై కేసులు పెట్టిన వారే నేడు నీతులు మాట్లాడటం హాస్యాస్పదమని ఆయన పేర్కొన్నారు. తెలుగు యువత నాయకులు పరుచూరి నరేష్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో విద్యావ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని, విద్యార్థులను అజ్ఞానంలో ఉంచడమే లక్ష్యంగా ఆ ప్రభుత్వం వ్యవహరించిందని ఆయన విమర్శించారు. గతం కంటే భిన్నంగా, ప్రస్తుతం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, టీచర్లకు అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ ఇప్పించే దిశగా అడుగులు పడుతున్నాయని తెలిపారు.గతంలో మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగ కల్పన చేస్తామని ఇచ్చిన హామీ మేరకు, ఎటువంటి అవినీతికి, సిఫార్సులకు తావులేకుండా పారదర్శకంగా 16,347 పోస్టులను భర్తీ చేశామని నరేష్ స్పష్టం చేశారు. ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు తమ కుటుంబాల్లో సంతోషం వ్యక్తపరుస్తున్నారని, నిరుద్యోగుల కలలను కూటమి ప్రభుత్వం నిజం చేసిందని పేర్కొన్నారు. అయితే, దీనిపై ప్రతిపక్ష వైసిపి అనవసరమైన దుష్ప్రచారం చేస్తోందని, విద్యార్థులను అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు.

కూటమి ప్రభుత్వం తీసుకువస్తున్న పెట్టుబడులు, కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షం ఆరోపణలు చేస్తోందని నరేష్ మండిపడ్డారు. బహిరంగ చర్చకు తాము సిద్ధమని, రాష్ట్రానికి వస్తున్న కంపెనీలు, అందులో లభిస్తున్న ఉద్యోగ అవకాశాలపై సంఖ్యలతో సహా చర్చించేందుకు సిద్ధమని ఆయన సవాల్ విసిరారు. రాష్ట్రంలోని నియోజకవర్గాల్లో కూటమి ఎమ్మెల్యేల సహకారంతో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పిస్తున్నామని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ దార్శనికతతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని ఆయన పునరుద్ఘాటించారు. గన్నవరం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు సందీప్ చల్లగుళ్ల మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో ఒక్క ఉద్యోగం కూడా కల్పించలేని వారు, నేడు 16 వేల మందికి పైగా ఉద్యోగాలు ఇచ్చిన ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. ప్రజలు ఇప్పటికే వైఎస్సార్సీపీని తిరస్కరించి 11 సీట్లకే పరిమితం చేశారని, అయినప్పటికీ ఆ పార్టీ నాయకులు మారని తీరుతో అసత్యాలతో భయాందోళనలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నియోజకవర్గంలో సొంత నిధులతో జాబ్ మేళాలు నిర్వహించి దాదాపు 7,600 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారని, అశోక్ లేలాండ్ వంటి పరిశ్రమలను తిరిగి తీసుకురావడంలో ఎమ్మెల్యే ఎంతో కృషి చేసారని చెప్పారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పనితీరును చూసి ఓర్వలేకనే ప్రత్యర్థులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, ఇలాంటి అబద్ధపు ప్రచారాలను ఇకపై తెలుగు యువత సహించేది లేదని ఆయన హెచ్చరించారు. తెలుగు యువత గన్నవరం నియోజకవర్గ ఉపాధ్యక్షులు చల్లగాలి సునీల్ మాట్లాడుతూ, వైఎస్సార్సీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలు కేవలం తమ కార్యకర్తలను కాపాడుకోవడానికి చేస్తున్న డ్రామాలు అని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వంలో నిరంతరం అభివృద్ధి పనులు జరుగుతుంటే, పాత అలవాటు ప్రకారం బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్కూళ్లలో చదువుకున్న విద్యార్థుల ఫలితాలు బాగున్నాయని, ఐటీ రంగంలో కొత్త కంపెనీలు వస్తున్నాయని, ఇవన్నీ చూసి ఓర్వలేని వైఎస్సార్సీపీ నేతలు అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అభివృద్ధిని అడ్డుకుంటూ ప్రభుత్వంపై విషప్రచారం చేస్తే ప్రజలే తగిన సమాధానం చెబుతారని, తెలుగు యువత కూడా దీటుగా స్పందిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని, తప్పుడు ప్రచారాలను తిప్పికొడతామని గట్టిగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు చల్లగాలి సునీల్, తాటిపాముల నాగయ్య, నియోజకవర్గ , టి ఎన్ ఎస్ ఎఫ్ అధ్యక్షుడు గోగం వెంకటరాం, టి ఎన్ ఎస్ ఎఫ్ నాయకులు పలగాని కళ్యాణ్, వేమూరి సాయి, కిలారు జగదీష్, మండల తెలుగుయువత అధ్యక్షులు గంపా శ్రీనివాస్, అన్నే చైతన్య, వినోద్, నియోజకవర్గ ఐటీడీపి అధ్యక్షులు ముక్కపాటి చైతన్య తదితరులు పాల్గొన్నారు

# గంజాయి, మద్యం మత్తులో ఘోరం

- గన్నవరంలో కత్తిపోట్లకు గురైన యువకుడు మృతి

**గన్నవరం నియోజకవర్గ జన సముద్రం ప్రతినిధి సురేష్**



కృష్ణా జిల్లా గన్నవరం మండలం అల్లాపురం (బుద్ధవరం పంచాయతీ) లో శనివారం సాయంత్రం మద్యం, గంజాయి మత్తులో జరిగిన ఘోర కత్తిపోట్ల ఉదంతం తీవ్ర కలకలం రేపింది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు పామర్తి హేమకుమార్ (21) అలియాస్ బిగిల్ చికిత్స పొందుతూ మరణించాడు. పాత కక్షల నేపథ్యంలోనే ఈ హత్య జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

పోలీసులు , స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కంకిపాడు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన హేమకుమార్‌కు, అల్లాపురం గ్రామానికి చెందిన వెలివెల జయంత్‌కు గతంలో స్నేహం ఉండేది. వీరిద్దరికీ గంజాయి, మద్యం సేవించే అలవాట్లు ఉన్నాయి. అయితే, గత నాలుగు నెలలుగా వీరి మధ్య తీవ్ర మనస్పర్థలు, పాత కక్షలు నడుస్తున్నాయి.

ఈ క్రమంలో శనివారం ఉదయం చినఆవుటపల్లి సమీపంలోని ఒక క్రికెట్ మైదానంలో వీరిద్దరి మధ్య మరోసారి మాటమాట పెరిగి గొడవ జరిగింది. అప్పట్లో అక్కడున్న మిగిలిన యువకులు వీరిని సర్దిచెప్పి పంపించివేశారు. అయినప్పటికీ కక్ష పెంచుకున్న జయంత్, ఎలాగైనా హేమకుమార్‌ను అంతమొందించాలనే ఉద్దేశంతో కత్తితో సిద్ధమయ్యాడు.

సాయంత్రం బుద్ధవరం పంచాయతీ కార్యాలయం సమీపంలోని ఎన్.టి.టి.ఎఫ్ రోడ్డు పరిసరాల్లో ఆరుబయట మద్యం, గంజాయి సేవించే ప్రాంతంలో హేమకుమార్ ఉండటాన్ని గమనించిన జయంత్, అక్కడకు చేరుకుని అతనితో మళ్లీ గొడవకు దిగాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం ముదరడంతో, జయంత్ తన వద్దనున్న కత్తితో హేమకుమార్‌పై విచక్షణా రహితంగా దాడి చేసి తీవ్రంగా పొడిచాడు.

రక్తపు మడుగులో పడివున్న హేమకుమార్‌ను స్థానికులు గమనించి వెంటనే చిన్నఅవుటపల్లి పిన్నమనేని ఆసుపత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వ సర్వజనాసుపత్రి (జిజిహెచ్) కి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ హేమకుమార్ ప్రాణాలు కోల్పోయాడు.

సమాచారం అందుకున్న గన్నవరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. హత్య కేసు నమోదు చేసి, ప్రస్తుతం పరారీలో ఉన్న నిందితుడు జయంత్ కోసం ప్రత్యేక బృందాలతో ముమ్మరంగా గాలిస్తున్నారు.

# ద్వారకాతిరుమల గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల సందడి: ఉత్సాహంగా సాగిన విద్యార్థుల నృత్య పోటీలు

**ద్వారకాతిరుమల, మే 31:**

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థుల ఉత్సాహంతో కళకళలాడుతున్నాయి. ఈ శిబిరాల్లో భాగంగా, ఆదివారం ఉదయం 9 గంటలకు విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నృత్య పోటీలను నిర్వహించారు.

ఈ పోటీలలో సమీపంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని, తమ ప్రతిభను ప్రదర్శించారు. విద్యార్థుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు, వేసవి శిబిరం ముగింపు రోజైన జూన్ 6న నిర్వహించే కార్యక్రమంలో బహుమతులను ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎన్.సి.హెచ్. రామకృష్ణ, రిసోర్స్ టీచర్ శ్రీవల్లి గారు, మరియు పలువురు పాఠకులు పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ పిల్లల్లో సృజనాత్మకతను పెంచేందుకు గ్రంథాలయ శాఖ చేస్తున్న ఈ ప్రయత్నాన్ని పలువురు అభినందించారు.

# జన జాతియ గరిమా ఉత్సవ్ 2026లో రమావత్ బీమా నాయక్ కు ఘన సన్మానం

- బంజారా/లంబాడీ సమాజం సంక్షేమం కోసం అందించిన విశేష సేవలకు గుర్తింపుగా తెలంగాణ ఆదివాసీ సాంస్కృతిక పరిశోధన మరియు శిక్షణ మిషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం

**జన సముద్రం న్యూస్ పల్నాడు జిల్లా ప్రతినిధి మే 31**

విశాఖపట్నంలో తెలంగాణ ఆదివాసీ సాంస్కృతిక పరిశోధన మరియు శిక్షణ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన “జనజాతియ గరిమా ఉత్సవ్ -- 2026” కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమావత్ బీమా నాయక్ కి విశిష్ట సేవలకు గాను ఘన సన్మానం అందజేశారు.



బంజారా/లంబాడీ సమాజం అభివృద్ధి, ఆదివాసీల హక్కుల పరిరక్షణ, విద్యా ప్రోత్సాహం, సామాజిక సేవా కార్యక్రమాలలో నాయక్ అందిస్తున్న విశేష కృషిని గుర్తించి ఈ గౌరవం అందజేయడం జరిగింది. ఈ సన్మానం ఆయన సామాజిక నాయకత్వానికి, సమాజ సంక్షేమ పనులకు ప్రతీకగా నిలిచింది.

ఈ సందర్భంగా రమావత్ బీమా నాయక్ కి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నాము అని తెలిపారు.

కార్యక్రమంలో స్థానిక సమాజ ప్రతినిధులు, సాంస్కృతిక పరిషత్ సభ్యులు, విద్యార్థులు మరియు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అందరూ ఆరోగ్యానికి కొంత సమయం కేటాయించాలని: విజయ్ గోగులమూడి

**విజయవాడ జనసముద్రం ప్రతినిధి సురేష్**




విజయవాడ బిఆర్టిఎస్ రోడ్ లో వైబ్ ఫిట్ నెస్ క్లబ్ వారు వైబ్ యువర్ బాడీ ఎవిరిడే అంటూ క్రీడలు, వ్యాయామం, ఆరోగ్యం పట్ల ప్రజలకు అవగాహనా కల్పిస్తూ 3కిలోమీటర్ల పరుగును నిర్వహించినట్లు వైబ్ క్లబ్ నిర్వాహకుడు జర్పల పుష్పక్ చంద్ర తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి మొట్టమొదటి అంతర్జాతీయ షూటింగ్ బాల్ క్రీడాకారుడు, రాష్ట్ర షూటింగ్ బాల్ సంఘ కోశాధికారి విజయ్ కుమార్ గోగులమూడి పాల్గొని ఈ పరుగును ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి వ్యాయామం అత్యంత ముఖ్యం. రోజువారీ శారీరక శ్రమ గుండె జబ్బులు, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులను నివారిస్తుంది. రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల ఒత్తిడి తగ్గి, మనసుకు ప్రశాంతత లభిస్తుందని అన్నారు. రోజువారీ దినచర్య (దైనందిన జీవితం) లేదా పనులలో ఎంత తీరిక లేకపోయినా ప్రతి ఒక్కరు ఆరోగ్యానికి కొంత సమయం కేటాయించాలని అన్నారు. ప్రత్యేక అతిధులుగా ఎన్టీఆర్ జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి లావేటి దుర్గారావు పాల్గొని రోజూ కనీసం 30 నిమిషాల పాటు వ్యాయామం చేయడం శ్రేయస్కరమని శరీర తత్వానికి, జీవనశైలికి తగిన వ్యాయామాలు ఎంచుకోవడం ముఖ్యమని అన్నారు. అనంతరం విజేతలుగా ప్రథమ స్థానంలో నిలిచిన రోషన్, రజిత పతకం సాధించిన మల్లంపల్లి శివాని, కాంశ్య పతకం సాధించిన వరుణ్ కి అతిథులు విజయ్, దుర్గారావు బహుమతులను ప్రధానం చేశారు.

# పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించి అన్ని విధాలా ఆదుకుంటాం

- రైతుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తాం :
- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
- నెల్లూరులో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేసిన పొగాకు రైతులు
- రైతుల సమక్షంలో మంత్రులు గొట్టిపాటి రవి, అచ్చెన్నాయుడు, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి ఆనం
- త్వరలో రైతు ప్రతినిధులు, అధికారులు, ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశం

**నెల్లూరు, మే 31 : జనసముద్రం జిల్లా ప్రతినిధి**

పొగాకు రైతుల సమస్యలను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా పరిగణిస్తోందని, వారికి గిట్టుబాటు ధర కల్పించి అన్ని విధాలా ఆదుకుంటామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.





ఆదివారం ఉదయం నెల్లూరు నగరంలోని సంతపేటలో గల తన క్యాంపు కార్యాలయంలో జిల్లాలోని పలువురు పొగాకు రైతులు, రైతు ప్రతినిధులు మంత్రిని కలిసి తమ సమస్యలను వివరించారు. పొగాకు కొనుగోళ్లు మందగించడం, వేలం ధరలు గణనీయంగా తగ్గిపోవడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని, పంటకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గంలోని డీసీపల్లి, ఉదయగిరి నియోజకవర్గంలోని కలిగిరి టొబాకో బోర్డు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఉదయగిరి, కావలి, ఆత్మకూరు ప్రాంతాల్లో వేలాది మంది రైతులు పొగాకు సాగుపై ఆధారపడి జీవిస్తున్నారని, ఈ ఏడాది వాతావరణం అనుకూలించి మంచి నాణ్యత గల పంట వచ్చినప్పటికీ ధరలు పడిపోవడం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందన్నారు. నెల్లూరు జిల్లాలో సుమారు 45 వేల ఎకరాల్లో పొగాకు సాగు జరుగుతుండగా, దాదాపు 4 వేల మంది రైతులు ఈ పంటపై ఆధారపడి ఉన్నారని తెలిపారు. గత ఏడాది కిలో పొగాకు ధర రూ.280 నుంచి రూ.360 వరకు పలికిందని, ప్రస్తుతం డీసీపల్లి, కలిగిరి కేంద్రాల్లో ధరలు రూ.190 వరకు పడిపోవడం రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తోందన్నారు. పొగాకు కొనుగోళ్ల విషయంలో రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో మాట్లాడినట్లు మంత్రి తెలిపారు. గిడ్డంగుల కొరత వంటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్లు చెప్పారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్, మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి తదితరులు ఇప్పటికే ఈ అంశాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. రాష్ట్రంలోని పొగాకు రైతులకు న్యాయం చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి కేంద్ర వాణిజ్య శాఖ, ఆర్థిక శాఖ మంత్రులకు లేఖ రాసినట్లు వెల్లడించారు. త్వరలోనే పొగాకు రైతు ప్రతినిధులు, టొబాకో బోర్డు అధికారులు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి సమస్యలపై సమగ్రంగా చర్చించనున్నట్లు తెలిపారు. ఆ సమావేశానికి నెల్లూరు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, రైతు ప్రతినిధులను కూడా ఆహ్వానిస్తామని చెప్పారు. పొగాకు రైతులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వం వారి పక్షాన నిలుస్తుందని, ప్రతి రైతును ఆదుకుంటామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పునరుద్ఘాటించారు.

## నేషనల్ ప్రిస్టేజ్ అవార్డు బాధ్యతను పెంచింది డా. షేక్ మహబూబ్ వలి వ్యాఖ్య

**మార్కాపురం, మే 31 (జన సముద్రం న్యూస్)**

నేషనల్ ప్రిస్టేజ్ అవార్డు లభించడం తనపై మరింత సామాజిక బాధ్యతను పెంచిందని ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ వలి అన్నారు. కర్ణాటక రాష్ట్రంలోని హుబ్లీ నగరంలో హోటల్ డేనిసన్‌లో శనివారం జరిగిన నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ అవార్డుల ప్రదానోత్సవంలో ఆయనకు నేషనల్ ప్రిస్టేజ్ అవార్డును ప్రదానం చేశారు.

ప్రముఖ టీవీ యాంకర్, నటులు మోహిత్ పూనివాలా, కరణ్ మెహ్రా చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. దేశవ్యాప్తంగా ఎంపికైన టాప్-10 ప్రముఖుల్లో డా. మహబూబ్ వలి చోటు దక్కించుకోవడం ఈ ప్రాంతానికి గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. ఇప్పటివరకు 114 అవార్డులు అందుకున్న ఆయన, ఈ పురస్కారంతో 115వ అవార్డును సొంతం చేసుకున్నారు.





ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ సామాజిక సేవ, రాజకీయ రంగాల్లో డా. మహబూబ్ వలి చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. భారత సైన్యంలో 20 సంవత్సరాలకు పైగా సేవలందించిన ఆయన, పదవీ విరమణ అనంతరం కూడా ప్రజాసేవలో కొనసాగుతూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయడంతో పాటు పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తున్నారని కొనియాడారు.

డా. మహబూబ్ వలి విశేష సేవలను గుర్తించి ప్రపంచ మానవ హక్కుల పరిరక్షణ కమిషన్ భారతదేశ ఉపాధ్యక్షుడిగా నియమించిందన్నారు. అలాగే పలు జాతీయ స్థాయి సేవా సంస్థలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా, ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ సంస్థకు రాష్ట్ర డిప్యూటీ చైర్‌పర్సన్‌గా సేవలందిస్తున్నారని వివరించారు.

అవార్డు స్వీకరించిన అనంతరం డా. మహబూబ్ వలి మాట్లాడుతూ తన సేవలను గుర్తించి ఈ గౌరవాన్ని అందించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డు సమాజంలోని పేద, బడుగు బలహీన వర్గాలకు మరింత సేవ చేయాలనే సంకల్పాన్ని పెంచిందన్నారు. ఈ సందర్భంగా ఆయనకు రాజకీయ, సామాజిక రంగాల ప్రముఖులు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు

# విశ్వసనీయతకు మరోసారి పెద్ద పీట

- నెల్లూరు రూరల్ లో సీటు ఖరారు చేసుకున్న బూడిద పురుషోత్తం ..?
- నూతన 35వ డివిజన్ నుంచి ఈసారి బరిలో
- ఆర్థికంగా శక్తివంతులు ఈ సీటు కోసం కోరిన తిరస్కరించిన కోటంరెడ్డి
- విధేయతకు ప్రాధాన్యత ఇచ్చిన కోటంరెడ్డి సోదరులు

**నెల్లూరు, మే 31, జనసముద్రం జిల్లా ప్రతినిధి.**



నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో కార్పొరేటర్ టిక్కెట్ ను బూడిద పురుషోత్తం యాదవ్ (బీసీ) ఖరారు చేసుకున్నారు. ఈ మేరకు విశ్వసనీయ వర్గాల సమాచారం. ప్రస్తుతం నెల్లూరు రూరల్ 26 వ డివిజన్ కార్పొరేటర్ గా ఆయన సతీమణి బూడిద సుప్రజా ఉన్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అప్పటి అధికార పార్టీ వైసీపీని వీడి బయటకు వచ్చిన తర్వాత అప్పటి అధికార పార్టీ ఎన్ని ప్రలోభాలు పెట్టిన పురుషోత్తం దంపతులు కోటంరెడ్డిని నమ్ముకొని ఆయన వెంట పయనించారు. అనేక కష్టాలను చవిచూశారు. రాజకీయాల్లో అత్యంత క్రియాశీలకంగా ఉంటూ కోటంరెడ్డి నమ్మకాన్ని సంపాదించుకున్నారు. దీంతో నెల్లూరు రూరల్ నుంచి మరోసారి బూడిద పురుషోత్తం పోటీ చేయడం ఖాయంగా కనిపిస్తుంది. ఈ సీటు కోసం ఆర్థికంగా స్థితి మంతులుగా ఉన్నవారు అనేకమంది నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి దగ్గరకు వచ్చి తమకు అవకాశం ఇయ్యాలని కోరిన ఆయన మాత్రం నమ్ముకున్న పురుషోత్తం వైపే మొగ్గు చూపనున్నారు. రిజర్వేషన్లు అన్ని కలిసి వస్తే, ఆయన ఈసారి కార్పొరేటర్ గా పోటీ చేయనున్నారు. ఈసారి ఈ డివిజన్ బీసీ జనరల్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఒకవేళ ఓసి అయిన పురుషోత్తమే టిడిపి అభ్యర్థిగా బరిలో ఉంటారు. కూటమి పొత్తుల్లో భాగంగా నెల్లూరు రూరల్ లో జనసేన -బిజెపికి సుమారు 7 సీట్లు వరకు పొత్తుల భాగంగా ఇవ్వాల్సి ఉంది. ఆ వివరాలను అతి త్వరలోనే చూద్దాం.

## ప్రముఖ వైద్యులు డాక్టర్ మునుస్వామి దుర్మరణం

**నెల్లూరు, మే 31, జనసముద్రం జిల్లా ప్రతినిధి.**



ఉమ్మడి నెల్లూరు జిల్లా, తిరుపతి తడ మండలం మాంబట్టు గ్రామానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ మునిస్వామి ఆదివారం నాడు ఉదయం దుర్మరణం చెందారు. తిరుపతి పట్టణంలోని స్విమ్స్ హాస్పిటల్ నందు ప్రముఖ వైద్యులు గా గుర్తింపు కలిగి ఎందరో రోగులకు తనదైన నైపుణ్యంతో వైద్య సేవలు అందించిన డాక్టర్ మునుస్వామి మరణం ఈ ప్రాంత వాసులను దిగ్భ్రాంతపరిచింది

అపాచీ రోడ్ లో ప్రయాణిస్తున్న డాక్టర్ మునిస్వామి కారు యొక్క వెనక టైరు ఒకసారి పేలడంతో సమీపంలోని వేప చెట్టును ఢీ కొట్టి దుర్మరణం పాలవడం జరిగింది. తన స్వగ్రామం మాంబట్టు లోని దేవాలయంలో జరుగుతున్న పూజా కార్యక్రమాలకు హాజరు కావడానికి వెళుతున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకోవడంతో ఆ ప్రాంతవాసుల్ని తీవ్ర నిరాశకు గురిచేసింది. తడ ఎస్సై కొండపనాయుడు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలను సేకరించారు.

## చిన్న వెంకన్న నిత్యాన్నదానానికి విరాళం.

**జన సముద్రం న్యూస్ ఏలూరు జిల్లా మే 31 ద్వారకాతిరుమల ప్రతినిధి.**



ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఆదివారం పోతవరం వాస్తవ్యులు కే భారతి కుటుంబ సభ్యులు రూ.1,00,000/- విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. దేవస్థానం ఏఈవో మెట్టపల్లి దుర్గారావు దాతలను అభినందించి, స్వామివారి ప్రసాదాలను, నిత్యాన్నదాన బ్రాండ్ పత్రాన్ని అందజేశారు.

# సి.టీ. యం పెద్ద చెరువులో యువకుడు గల్లంతు

**జనసముద్రం న్యూస్, మదనపల్లి, మే 31:-**



అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి మండలం చిన్న తిప్ప సముద్రం చెరువులు యువకుడు గల్లంతవ్వడం కలకలం రేపుతోంది. జువీ కొత్తపేటకు చెందిన బాలాజీ చిన్నతిప్ప సముద్రం చెరువుకు బట్టలు ఉతకను ఆదివారం వెళ్లి పొరపాటున లోతునీటిలోకి పడి మునిగిపోయాడు. కుటుంబీకులు కేకలు వేయడంతో స్థానికులు తాలూకా పోలీసులకు, అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక అధికారి శివప్ప ఫైర్ సిబ్బందితో వెళ్లి చెరువులో వెతుకుతున్నారు.

## కలెక్టరేట్ లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ( పి జి ఆర్ ఎస్ ) నిర్వహణ

**మీకోసం -- ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం**

**జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**

**నెల్లూరు, మే 31 : జనసముద్రం జిల్లా ప్రతినిధి.**

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ( పి.జి. ఆర్. ఎస్ ) ను ఈ సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నందు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

అర్జీదారులు తమ అర్జీలను అధికారిక వెబ్‌సైట్ మీకోసం యాప్ ద్వారా నమోదు చేసుకోవచ్చును. అర్జీ స్థితి లేదా ఇతర వివరాలకు సం2బంధించి సమాచారం కోసం నేరుగా 1100 కాల్ సెంటర్ ను సంప్రదించవచ్చును. కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వీటిలో సహాయకులతో కూడిన అర్జీ స్వీకరణ కౌంటర్లు, రిసెప్షన్ సదుపాయం, జిల్లా మరియు మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం, అర్జీల పర్యవేక్షణ తదితర ఏర్పాట్లు చేయడమైనది. అర్జీదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## చిన్న వెంకన్న విమాన గోపుర పథకానికి విరాళం.

**జన సముద్రం న్యూస్ ఏలూరు జిల్లా మే 24 ద్వారకాతిరుమల ప్రతినిధి.**



ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి విమాన గోపుర పథకానికి ఆదివారం గోపవరం వాస్తవ్యులు ఎన్. రామకృష్ణ దంపతులు రూ.1,01,116/- విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. దేవస్థానం ఏఈవో మెట్టపల్లి దుర్గారావు దాతలను అభినందించి, స్వామివారి ప్రసాదాలను, విమాన గోపుర బ్రాండ్ పత్రాన్ని అందజేశారు.

## బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శిగా ఆర్ రామారావు

**జనసముద్రం న్యూస్ జూన్ 1 సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ నియోజకవర్గం ఆర్సి రిపోర్టర్ అలవాలరవి.**



నేను అనగా రాళ్ల బండి రామారావు బిజెపి పార్టీలో కార్యకర్తగా పనిచే స్తున్నాను అయితే నన్ను హుజూర్నగర్ పట్టణ ప్రధాన కార్యదర్శి గా ఎన్నికలు చేసిన భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండ హరీష్ గౌడ్ గారు రాళ్ల బండి రామారావునీ నియమించడం జరిగింది పట్టణ అధ్యక్షుడు గారికి కృతజ్ఞతలు తెలిపినారు

# లెబనాన్ బ్యూఫోర్ట్ క్యాజిల్‌ను స్వాధీనం చేసుకొన్న ఇజ్రాయెల్..!



దక్షిణ లెబనాన్‌లోని బ్యూఫోర్ట్ క్యాజిల్‌ను ఇజ్రాయెల్‌కు చెందిన గోలానీ బ్రిగేడ్ దళాలు స్వాధీనం చేసుకొన్నాయి. దీనిపై ఇజ్రాయెల్ పతకాలను ఆ దళం ఎగురవేసింది. 1982 తొలి లెబనాన్ యుద్ధంలో ఇజ్రాయెల్ దళాలు ఈ కోటను మొదటిసారి స్వాధీనం చేసుకొన్నాయి. నాడు కూడా గోలానీ బ్రిగేడే పాలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్ దళాలతో పోరాడి.. ఈ కోటను ఆక్రమించాయి. నాటి నుంచి 2000 సంవత్సరం వరకు ఇది ఇజ్రాయెల్ ఆధీనంలోనే ఉంది.

తాజాగా ఇజ్రాయెల్‌పై హమాస్ దళాలు భారీగా దాడులు చేసిన మర్నాడే తిరిగి ఈ కోటను ఐడీఎఫ్ స్వాధీనం చేసుకోవడం గమనార్హం. దక్షిణ లెబనాన్, ఉత్తర ఇజ్రాయెల్‌పై నిఘా పెట్టడానికి ఈ కోట అత్యంత వ్యూహాత్మక ప్రదేశం. ఈ ప్రాంతంలోని రాకెట్ లాంచింగ్ వ్యవస్థలపై తాము దృష్టి పెట్టబోతున్నట్లు ఇజ్రాయెల్ బలగాలు వెల్లడించాయి.

"బ్యాటిల్ ఆఫ్ బ్యూఫోర్ట్ ముగిసిన 44 ఏళ్ల తర్వాత ఇజ్రాయెలీ దళాలు తిరిగి ఆ కోటపై పతకాలను ఎగురవేశాయి" అని ఆ దేశ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ ప్రకటించారు. ఈ కోట స్వాధీనం చేసుకోవడానికి యుద్ధ విమానాల సాయంతో ఇజ్రాయెల్ దళాలు భారీ ఎత్తున బాంబింగ్ చేయడంతోపాటు భూతల పోరాటం కూడా చేశాయి.




## టాక్ యావరేజ్.. కలెక్షన్స్ సూపర్ హిట్.. మరి 'దృశ్యం 4' ఉంటుందా?

మోహన్‌లాల్ కీలక పాత్రలో జీతూ జోసెఫ్ దర్శకత్వంలో వచ్చిన తాజా క్రైమ్ మిస్టరీ థ్రిల్లర్ 'దృశ్యం3' . గతం చిత్రాలకు కొనసాగింపుగా ఈ మూవీని తీర్చిదిద్దారు. మలయాళంతో పాటు, తెలుగులోనూ విడుదలైన ఈ సినిమా మిశ్రమ స్పందనలకే పరిమితమైంది. మరీ ముఖ్యంగా ప్రథమార్ధమంతా సాగదీత వ్యవహారమంటూ సమీక్షకులు, విమర్శకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. కానీ అవేవీ 'దృశ్యం3' వసూళ్లను ఆపలేకపోయాయి. ద్వితీయార్ధం, ముఖ్యంగా చివరి గంట కథ, కథనాలను ఆసక్తికరంగా థ్రిల్ పంచేలా నడపడంలో జీతూ మార్క్ కనపడింది. అదే ఇప్పుడు ఈ మూవీని నిలబెట్టింది. వసూళ్లలో సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ మూవీ రూ.200 కోట్లకు పైగా రాబట్టి, అత్యధిక వసూళ్ల మలయాళ చిత్రాల్లో ఒకటిగా నిలిచింది.

### ఇండియాలో రూ.100 కోట్లు

మే 21న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ తాజాగా భారత్‌లో రూ.105 కోట్లు (గ్రాస్) రాబట్టింది. శనివారం దేశవ్యాప్తంగా 2,570 షోలు పడగా, రూ.5.05 కోట్లు వచ్చాయి. ఓవర్సీస్‌లోనూ ఈ మూవీని ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా రూ.113.75 కోట్లు వసూలు చేయగా, మొత్తం రూ.219 కోట్లకు పైగా రాబట్టింది. తాజా వసూళ్లతో అత్యధిక కలెక్షన్స్ రాబట్టిన మలయాళ చిత్రాల్లో ఆరోస్థానంలో నిలిచింది. రూ.303 కోట్లతో ఇప్పటికీ 'కొత్తలోక: చాప్టర్1' టాప్‌లో ఉండటం గమనార్హం.

### దృశ్యం4 ఉంటుందా?

'దృశ్యం3' బాక్సాఫీస్ వద్ద విజయవంతమైతే 'దృశ్యం 4, 5' కూడా రావొచ్చని మోహన్‌లాల్, దర్శకుడు జీతూ జోసెఫ్ పలు వేదికలపై అభిప్రాయం వ్యక్తం చేశారు. అన్నట్లుగా ప్రస్తుతం 'దృశ్యం3' బాక్సాఫీస్ వద్ద జోష్ చూపిస్తోంది. ఈ క్రమంలో నాలుగో భాగం వచ్చే అవకాశాన్ని కొట్టిపారేయలేం. అయితే, ఇప్పటికిప్పుడే అది సాధ్యమయ్యే పని కాదు. ప్రస్తుతం విజయాన్ని ఆస్వాదిస్తున్న చిత్ర బృందం నుంచి కూడా ఎలాంటి ప్రకటనా రాలేదు. అలాగని, చెప్పిన కథే మళ్లీ చెప్పి పిప్పి పిప్పి చేసి, చివరో ఓ ట్విస్ట్‌తో ముగిస్తానంటే కుదరదు. చూద్దాం..! దేనికైనా కాలమే సమాధానం చెబుతుంది.

## 'నో' చెప్పడం కూడా నేర్చుకుంటేనే...!

మాతృత్వ దశ తన జీవితాన్ని మార్చివేసింది కానీ తాను పనిచేసే విధానాన్ని మాత్రం మార్చలేదని అంటోంది బాలీవుడ్ కథానాయిక యామీ గౌతమ్. 'ఆర్టికల్ 370', 'హక్' లాంటి శక్తిమంతమైన కథలతో ప్రయాణిస్తున్న నాయికీమె. ఇటీవలే 'ధురంధర్ 2'లో అతిథి పాత్రలో మెరిసిన ఈమె.. ప్రస్తుతం 'నయీ నవేలి' అనే సినిమాతో బిజీగా ఉంది. ఈ నేపథ్యంలోనే ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న యామి.. కొన్ని ఆసక్తికర విషయాలతో అభిమానుల ముందుకొచ్చింది. "ఇటీవలే నేను బాబుకి జన్మనిచ్చిన విషయం అందరికీ తెలిసిందే. కానీ తల్లి కావడం నా వృత్తిపరమైన ఎంపికలను ఏ మాత్రం ప్రభావితం చేయలేదు. వ్యక్తిగత, వృత్తిపర జీవితాల మధ్య సమతుల్యతను పాటించాలనే విషయం గురించి నాకు తెలుసు. ఒక్కసారి మీరు తల్లి అయ్యాక.. ఆ గుర్తింపు అన్నివేళలా మీతోనే ఉంటుంది. సెట్‌లో నేను ఒక నటిగా పనిచేస్తున్నప్పటికీ.. ప్రతి క్షణం నేను ఒక తల్లినే. మాతృత్వం అనేది గొప్ప భావోద్వేగం. ఇలాంటి అద్భుతమైన అనుభూతిని పొందినందుకు నేను చాలా అదృష్టవంతురాలిని".

### సందేహంగా ఒప్పుకున్నా.. సాగిపోవాలి

"సినీరంగంలో నా దశాబ్దాల కెరీర్‌ను వెనక్కి తిరిగి చూసుకుంటే.. నా ఎదుగుదలకు దృఢ సంకల్పమే ముఖ్య కారణం. ఒకానొక దశలో నేను విజయాల వెంట పడటం మానేసి.. నా మనసుకు నిజంగా హత్తుకునే కథలకు ప్రాధాన్యత ఇవ్వడం ప్రారంభించాను. దీనికి సహనం ఎంతో అవసరం. మీరు అవకాశాలను వెతుక్కునే సమయంలో మీకు సరిపోయే ఆ ఒక్క సినిమాను, పాత్రను కూడా గుర్తించడం చాలా ముఖ్యం. ఈ క్రమంలో కొన్నిసార్లు 'నో' చెప్పడం కూడా నేర్చుకోవాలి. కొందరు సందేహంగానే కొన్ని ప్రాజెక్టుల్ని ఒప్పుకొని ఉండొచ్చు. అయినా మీరు ముందుకు సాగుతూనే ఉండాలి. అందరికీ కనిపించేలా పనిచేస్తూనే ఉండాలి".

### అతిగా ఆలోచించను

"జీవితంలో ఒక దశకు చేరుకున్న తర్వాత మనలో భయం పోతుంది. నా విషయంలో అది 'బాలా', 'ఉరి' సినిమాల సమయంలో జరిగింది. పాత్రలు నన్ను ఆకట్టుకుంటేనే వాటిని అంగీకరించాలని అప్పుడే గట్టిగా నిర్ణయించుకున్నా. నేను కొన్ని విషయాల గురించి అతిగా ఆలోచించను. నచ్చకపోతే.. అది నాకు వెంటనే తెలిసిపోతుంది. ఏదేమైనా నా మనసు చెప్పేదే నమ్ముతా".



# మే మెరుపుల్లేవ్!

వేసవి సినీ మారథాన్‌కి జూన్ క్లైమాక్స్ అయితే.. ప్రీక్లైమాక్స్ మే. జూన్ రెండో వారానికే సెలవుల సీజన్ ముగుస్తుంది కనుక.. ఈ సీజన్‌లో ఆఖరిగా వచ్చే బడా చిత్రాలన్నీ మేలోనే మెరుపులు మెరిపించేందుకు బాక్సాఫీస్ ముందుకు వరుస కడుతుంటాయి. అయితే కొవిడ్ తర్వాత నుంచి ఈ పరిస్థితులన్నీ పూర్తిగా తారుమారయ్యాయి. గత నాలుగైదేళ్లలో తెలుగు చిత్రసీమ ఒక్క వేసవి సీజన్‌నీ పూర్తిగా సొమ్ము చేసుకోలేకపోయింది. ఇక ఈసారైతే మరింత గడ్డు పరిస్థితి. సమ్మర్‌లో ఇంతవరకు సరైన సినిమా పడలేదని ఇటు ప్రేక్షక లోకం.. అటు సినీ పరిశ్రమ ముక్త కంఠంతో చెబుతోంది. మార్చి, ఏప్రిల్‌లో ఒకటి రెండు చెప్పుకోదగ్గ చిత్రాలైనా థియేటర్లలో సందడి చేసినా.. కీలకమైన మేలో ఒక్కటంటే ఒక్కటీ చెప్పుకోదగ్గ సినిమా కనిపించకపోవడం సినీ ప్రేమికుల్ని, పరిశ్రమ వర్గాల్ని కలవరపాటుకు గురి చేస్తోంది. ఈ మేలో నేరుగా తెలుగు




చిత్రసీమ నుంచి దాదాపు ఇరవై చిత్రాల వరకు బయటకొచ్చినా.. అందులో ఏ ఒక్కటీ ప్రేక్షకుల్ని థియేటర్ల బాట పట్టించలేకపోయింది. ఆ వచ్చిన వాటిలో ఏ ఒక్క దాంట్లోనూ స్టార్ కళ కనిపించకపోవడం.. ప్రేక్షకుల్ని థియేటర్ల బాట పట్టించే కంటెంట్ లేకపోవడం పెద్ద లోటు. మే తొలివారం తరుణ్ భాస్కర్ 'గాయపడ్డ సింహం', సత్య 'జెట్లీ' చిత్రాలు బాక్సాఫీస్ బరిలో తలపడ్డాయి. వీటిలో తరుణ్ సినిమాకి పాస్ మార్కులు పడ్డప్పటికీ.. థియేటర్లకు కళ తెచ్చే స్థాయిలో వసూళ్లు రాలేదు. ఆ మరుసటి వారం 'గోదారి గట్టుపైన', 'రేజర్', 'సతీ లీలావతి'.. ఇలా నాలుగైదు చిత్రాలు అదృష్టం పరీక్షించుకున్నాయి. కానీ, వీటిలో ఏ ఒక్కటీ సినీప్రియుల దృష్టిని ఆకర్షించలేకపోయాయి. ఇక మే చివరి మూడు వారాల్లో తెలుగు నుంచి 'దూరదర్శిని', 'హరుడు', 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోం', 'పురుషః', 'ఫస్ట్ టైమ్', 'రమణీ కల్యాణం', 'అగ్లీ స్టోరీ', 'త్రికాల', 'మరీచిక', 'సందిగ్ధం' లాంటి డజను వరకు చిన్న చిత్రాలు థియేటర్ల ముందుకొచ్చినా.. ఏ ఒక్కటీ కనీస వసూళ్లని కూడా రాబట్టలేకపోయింది. అనువాదాలు సొమ్ము చేసుకున్నాయి..

ఈ మేలో తెలుగు చిత్రసీమకి కూడా కాస్తోకూస్తో ఊపిరిపోసినవి అనువాద చిత్రాలే. మే రెండో వారంలో సూర్య 'వీరభద్రుడు' సినిమాతో.. మూడో వారంలో మోహన్‌లాల్ 'దృశ్యం 3'తో బాక్సాఫీస్ బరిలో సందడి చేశారు. నిజానికి వీటికి తెలుగులో సరైన ప్రచారం లేకున్నా... రివ్యూల పరంగా మిశ్రమ స్పందన లభించినా.. చెప్పుకోదగ్గ స్థాయిలో టికెట్లు తెగడం, మంచి వసూళ్లు రాబట్టడం విశేషం. కాస్త కంటెంట్ ఉన్న సినిమా పడి.. దానికి స్టార్ బలం కూడా తోడైతే ఎండల్నీ, ఐపీఎల్‌నీ లెక్క చేయకుండా జనాలు థియేటర్లకు వస్తారనడానికి ఈ అనువాదాలు నిదర్శనంగా నిలిచాయి. ఇక ఆఖరి వారంలో అర్జున్, ప్రీతి ముకుందన్ ప్రధాన పాత్రల్లో నటించిన అనువాద చిత్రం 'బ్లాస్ట్'కు ప్రేక్షకుల నుంచి మంచి మౌత్ టాక్ లభిస్తోంది.

## ఎప్పటికీ మీరే నా హీరో: మహేశ్‌బాబు పోస్టు

తన తండ్రి, నటుడు దివంగత కృష్ణ జయంతి సందర్భంగా మహేశ్‌బాబు ఎమోషనల్ పోస్టు పెట్టారు. 'ఎప్పటికీ మీరే నా హీరో. హ్యాపీ బర్త్ డే నాన్నా' అంటూ తండ్రిపై ప్రేమను వ్యక్తం చేశారు. మహేశ్ సతీమణి నమ్రతా శిరోద్కర్ కూడా కృష్ణను స్మరించుకున్నారు. ఎప్పుడూ ప్రేమతో మిమ్మల్ని తలచుకుంటూనే ఉంటామంటూ పోస్టు చేశారు

### కృష్ణ సేవలు చిరస్మరణీయం: సీఎం చంద్రబాబు

కృష్ణను స్మరించుకుంటూ.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ట్వీట్ చేశారు. "తెలుగు సినీ పరిశ్రమకు నటుడిగా, దర్శకుడిగా, సాహసోపేత నిర్మాతగా విశిష్ట



సేవలందించిన పద్మభూషణ్ కృష్ణ గారి జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకుంటున్నా. నూతన సాంకేతికతలను పరిచయం చేస్తూ సినీ రంగ అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన ఆయన సేవలు చిరస్మరణీయం. అభిమానుల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించిన ఆ మహానటుడికి ఘన నివాళులు" అని పేర్కొన్నారు.

## ఇండస్ట్రీ సమస్యలు.. దాసరి దారి చూపారు..
# హీరోలకు మంచు మనోజ్ విజ్ఞప్తి

ప్రస్తుతం ఇండస్ట్రీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి దర్శకరత్న దాసరి నారాయణరావు ఎప్పుడో దారి చూపారని మంచు మనోజ్ అన్నారు. దాసరి నారాయణరావు సమాధి దుస్థితి చూసి చలించిపోయిన ఆయన తన టీమ్‌తో కలిసి శుభ్రం చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా తన సతీమణి మౌనికతో కలిసి దాసరి విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "గురువుగారు దాసరి వర్ధంతి అన్న సంగతి నాకూ గుర్తులేదు. చిత్రపురి కాలనీ వైపు వస్తుంటే, ఆ దారిలో గురువుగారి విగ్రహం ఉంటుంది. అది చూడగానే ఆయన కుటుంబం గుర్తు వచ్చింది. ఈలోగా ఆయన సమాధి పరిస్థితి తెలుసుకుని నా టీమ్‌తో కలిసి ఉదయాన్నే వచ్చేశా. అందరూ ఎంతో శ్రమించారు"

"దాసరిగారు గొప్ప దర్శకుడు. స్క్రీన్‌ప్లే రైటర్. ఎడిటింగ్, మ్యూజిక్, డైలాగ్స్ ఇలా అన్నింటిపైనా పట్టు కలిగిన వ్యక్తి. ఒక్క మాటలో చెప్పాలంటే ఆయనొక ఇనిస్టిట్యూట్. ఆయన ఎన్నో గొప్ప సినిమాలు తీశారు. సోషల్, కమర్షియల్, మహిళా ప్రాధాన్యమున్న చిత్రాలు రూపొందించారు. 'దాసరి పని అయిపోయింది' అని టాక్ వినిపించిన ప్రతిసారీ కొత్తదనంతో ప్రేక్షకులను అలరించారు. ప్రస్తుతం మనం




థియేటర్స్ సమస్యలంటూ మాట్లాడుకుంటున్నాం. కానీ, నాకు తెలిసి గురువుగారు ఎప్పుడో దీనికి ఓ మార్గం చూపించారు. ఏడాదికి పది నుంచి పదిహేను సినిమాలు చేస్తూ.. ఎంతో మందికి ఉపాధి లభించేలా చేశారు. ఎప్పుడో ఓ సినిమా చేయటం కాదు.. ఎప్పుడూ సినిమా చేయాలని దాసరి అనేవారు. ఇకపై నాతో సహా అందరూ హీరోలు వీలైనన్ని ఎక్కువ సినిమాలు చేయాలని కోరుతున్నాను. ఆ బాధ్యత అందరిపైనా ఉంది. దాసరి ఘాట్‌ను పార్క్‌లా కాకుండా చుట్టు పక్కల పిల్లలు ఆడుకునేలా తీర్చిదిద్దితే బాగుంటుందని అనుకుంటున్నా" అని అన్నారు.